ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక - 112 | గురువారం 22 జనవరి 2026 | పేజీలు - 8 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

Ph:8368102842
నాశా క్లినిక్
డా.భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుంచి 8.30 వరకు
సా.4 గం.నుంచి రాత్రి.8.30 వరకు
డా.నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుంచి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు




## ఇజ్రాయిల్‌కు సిఎం చంద్రబాబు ఓపెన్ ఇన్విటేషన్...

- భారత్ - ఇజ్రాయెల్ ఆర్థిక సహకారానికి దావోస్ వేదిక..
- రక్షణ, ఏరోస్పేస్, యూఏవీ రంగాల్లో భాగస్వామ్యంపై చర్చ...
- మెడికల్, విద్య, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో సంయుక్త రూపకల్పనపై చర్చ...
- ఏపీని మెడ్ - టెక్, ఏరో - డిఫెన్స్ హబ్‌గా అభివృద్ధి చేసే లక్ష్యం దిశగా...
- ఏపీలో క్లీన్ - టెక్ పెట్టుబడులకు నూతన అవకాశాలు...
- ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి నిర్ బార్కాట్‌తో సీఎం చంద్రబాబు భేటీ...

**అమరావతి (తెలుగోడు), జనవరి 21 :**

ఇజ్రాయిల్ ప్రతినిధులు భారత్‌లోని ఏపికి వచ్చి పెట్టుబడులు పెట్టాలని సిఎం చంద్రబాబునాయుడు ఆహ్వానించారు. భారత్ - ఇజ్రాయెల్ ఆర్థిక సహకారానికి దావోస్ వేదికని స్పష్టం చేశారు. ఏపీలో క్లీన్ - టెక్ పెట్టుబడులకు నూతన అవకాశాలున్నాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. బుధవారం దావోస్‌లో ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి నిర్ బార్కాట్‌తో సీఎం సమావేశమయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఇజ్రాయెల్‌తో విస్తృతంగా చర్చించామని చంద్రబాబు తన ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించారు. రక్షణ, ఏరోస్పేస్, యూఏవీ రంగాల్లో భారత్ - ఇజ్రాయెల్ భాగస్వామ్యంపై చర్చించినట్లు తెలిపారు. అలాగే సెమీ కండక్టర్, క్వాంటమ్ టెక్నాలజీలో సహకార అవకాశాలతో పాటు నీటి శుద్ధి, భూగర్భ జలాల నాణ్యతపై ఇజ్రాయెల్ నైపుణ్యం, వినియోగంపైనా చర్చించినట్టు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అదే విధంగా.. మెడికల్, విద్య, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో సంయుక్త కార్యక్రమాల రూపకల్పనపై చర్చించామని వివరించారు సీఎం చంద్రబాబు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇజ్రాయెల్ ఇండస్ట్రియల్ పార్క్ ప్రతిపాదన సహా ఏపీని మెడ్ - టెక్, ఏరో - డిఫెన్స్ హబ్‌గా అభివృద్ధి చేసే లక్ష్యం దిశగా అడుగులు పడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక తయారీకి ఇజ్రాయెల్ కంపెనీలను ఆకర్షించేందుకు ప్రణాళికలపై సైతం ఈ సందర్భంగా కూలంకషంగా చర్చించామని చంద్రబాబు తెలిపారు. మరోవైపు సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన రేపటితో అంటే.. గురువారంతో ముగియనుంది. జనవరి 22వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు జ్యూరిక్ ఎయిర్ పోర్ట్ నుంచి సీఎం చంద్రబాబు బృందం భారత్‌కు బయలుదేరనుంది. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి ఉదయం 10 గంటలకు ఉండవల్లిలోని నివాసానికి

మిగతా 2లో

# త్వరలో... జగన్ పాదయాత్ర 2.0




## మరోసారి పాదయాత్రకు సిద్ధమవుతున్న వైయస్ జగన్

**తాడేపల్లి (తెలుగోడు), జనవరి 21 :**

ఏపీలో వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరోసారి పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే దీనిపై ప్రకటన చేసిన జగన్.. ఇవాళ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో ఏలూరు నియోజకవర్గం నేతలతో జరిగిన సమావేశంలో మరికొంత స్పష్టత ఇచ్చారు. అలాగే ఈ పాదయాత్రకు సన్నాహంగా చేపట్టాల్సిన కార్యక్రమంపైనా నేతలకు హింట్ ఇచ్చారు. దీంతో మరోసారి వైసీపీ క్యాడర్ లో జోష్ కనిపిస్తోంది. రాష్ట్రంలో ఎక్కడ చూసినా వ్యవస్థలు నిర్వీర్య మయ్యాయని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు తోడుగా పార్టీ ఉండాలని నేతలకు జగన్ దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు, రైతులు, యువత, అక్కచెల్లెమ్మలు ఇలా ఏ వర్గానికి కష్టం వచ్చినా నిలబడుతున్నామని గుర్తుచ్చేరు. జెండా పట్టుకుని వారి తరపున పోరాడు తున్నామన్నారు. ఇదే స్ఫూర్తి ఇక ముందు కూడా కొన సాగించాలని జగన్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ప్రతి ఇంట్లో ఇప్పుడు అదే చర్చ జరుగుతోందని తెలిపారు. జగన్? ఉంటే, ఎలా మేలు జరిగేదన్నది జనం ఆలోచిస్తున్నా రన్నారు. గతంలోనూ తాను నేతలతో భేటీలు అయ్యానని, ఇప్పుడు ఏలూరు నియోజకవర్గంతో ఆ కార్యక్రమాన్ని తిరిగి మొదలుపెడుతున్నామని జగన్ తెలిపారు. ఇక ముందు వారానికి ఒక నియోజకవర్గాన్ని ఎంచుకుని ఇలా సమావేశం అవుతానన్నారు. మిగిలిన ఈ మూడేళ్లలో అందులో ఏడాది న్నర తర్వాత తన పాదయాత్ర మొదలు పెడతానన్నారు. ఆ విధంగా దాదాపు ఏడాదిన్నర పాటు, తాను ప్రజల్లోనే, ప్రజలతోనే ఉంటానన్నారు.

# పెట్టుబడులపై లోకేష్ దృష్టి





- గ్రీన్ అమ్మోనియా తయారీ కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టాలని పిలుపు..
- రాయలసీమలో సౌర-పవన హైబ్రిడ్ ప్రాజెక్టుల ఏర్పాటుకై చర్చ..
- యుటిలిటీ-స్కేల్ పునరుత్పాదక శక్తి తయారీలో భాగస్వామ్యం..
- జపాన్‌కు చెందిన జెరా సంస్థ సిఇవోతో భేటీ..

**అమరావతి (తెలుగోడు), జనవరి 21 :**

దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో వివిధ దేశాలకు చెందిన వ్యాపార వేత్తలు, సీఈఓలతో ఏపీ మంత్రి నారా లోకేశ్ భేటీ అవుతూ బిజీ బిజీగా గడుపుతున్నారు. తాజాగా.. జపాన్‌కు చెందిన ప్రముఖ రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ జెరా గ్లోబల్ సీఈవో అండ్ ఛైర్మన్ యుకియో కానితో మంత్రి లోకేశ్ దావోస్‌లో భేటీ అయ్యారు. ఏపీలోని గ్రీన్ అమ్మోనియా తయారీ కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టాలని లోకేశ్ కోరారు. పాన్, ఇతర ఆసియా మార్కెట్లకు లో-కార్బన్ అమ్మోనియాను సరఫరా చేయడానికి మూలపేట, కృష్ణపట్నం, కాకినాడ పోర్టుల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉపయోగించుకుని సమీపంలోని గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టాలని వారికి విజ్ఞప్తి చేశారు లోకేశ్. పారిశ్రామిక వినియోగదారులకు దృఢమైన క్లీన్ ఎనర్జీ సరఫరా చేయడానికి రాయలసీమలో సౌర-పవన హైబ్రిడ్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని వెల్లడించారు. పాన్ భవిష్యత్తు క్లీన్ ఇంధన దిగుమతులకు మద్దతు ఇవ్వడానికి భారత్‌లో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా వాల్యూ చైన్లను ఏర్పాటు చేయాలని జెరా సంస్థ నిర్ణయించుకుంది. రెన్యూ ఎనర్జీ గ్లోబల్‌తో భాగస్వామ్యం ద్వారా యుటిలిటీ-స్కేల్ పునరుత్పాదక శక్తి తయారీలో భాగస్వామ్యం వహిస్తున్నట్లు జెరా సీఈవో యుకియో వెల్లడించారు. పునరుత్పాదక శక్తితో పాటు ఎల్ఎన్‌జీ ఆధారిత విద్యుత్ పరివర్తన, గ్రిడ్-బ్యాలెన్సింగ్ పరిష్కారాలపై దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు.

# చట్టబద్ధతకు రంగం సిద్ధం

## బడ్జెట్ సమావేశాల్లో రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే అవకాశం



**అమరావతి (తెలుగోడు), జనవరి 21 :**

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి చట్టబద్ధతకు రంగం సిద్ధం అయింది. వచ్చే వారం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. దీంతో, ఈ సారి జరిగే క్యాబినెట్ భేటీలో ఆమోదం తర్వాత పార్లమెంట్లో బిల్లు పెట్టేందుకు సిద్ధమైనట్లు సమాచారం. పదేళ్లపాటు రెండు రాష్ట్రాలకు రాజధానిగా ఉన్న హైదరాబాద్ కాలపరిమితి 2024 జూన్ రెండు తో ముగిసింది. రాష్ట్ర విభజన సమయంలో పదేళ్ల పాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఖరారు చేసారు. దీంతో.. 2024 జూన్ 2 నుంచి రాజధానిగా అమరావతిని ప్రకటించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దీని పైన రాజధాని ఎంపిక ప్రక్రియ ,నిర్మాణాలపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం అధికారికం గా వివరాలు (మిగతా 2లో)



# హెరిటేజ్ పాలకంటే భూమి ధరలు తక్కువ

## సూపర్‌సిక్స్ అంటూ ప్రజలకు సూపర్ మోసం

**విజయనగరం (తెలుగోడు), జనవరి 21 :**

రాష్ట్రంలో హెరిటేజ్ పాలకంటే తక్కువ ధరలకు భూములను అప్పనంగా కూటమి ప్రభుత్వం ఇచ్చేస్తోందని మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఎద్దేవా చేశారు.వైఎస్సార్సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని కూటమి నేతలు ప్రజలను సూపర్ మోసం చేశారన్నారు. చంద్రబాబు సమర్థవంతంగా అమలు చేస్తున్న పథకం ఒక్కటే. అది ప్రైవేటు వాళ్లకి దోచిపెట్టడం అని ఆరోపించారు. హెరిటేజ్ పాల ప్యాకెట్ కంటే విశాఖపట్నంలో ఎకరా భూమి ధర తక్కువ. సామాన్యులను వదిలేసి కార్పొరేట్ల కోసం పనిచేసే వాళ్ళని దావోస్ మ్యాన్ అంటారు. దావోస్లో కూటమి నేతలు కలరింగ్ ఇస్తున్నారన్నారు. భూములు ప్రజా సంపద. చంద్రబాబు.. విశాఖ భూములు ఏమైనా మీ బాబు గారి సొమ్మా?. భూములున 99 పైసలకే ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి?. విశాఖపట్నం భూములు పప్పు బెల్లాల్లా పంచుతున్నారు మరి అమరావతి భూములు ఎందుకు ఇవ్వరు (మిగతా 2లో)

# నాకేమైనా జరిగితే ఇరాన్‌ఔట్

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



**వాషింగ్టన్ (తెలుగోడు), జనవరి 21 :**

ఇరాన్‌ను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై ఇరాన్ హత్యకు పాల్పడితే.. ఆ దేశాన్ని అమెరికా భూస్థాపితం చేస్తుందని వార్నింగ్ ఇచ్చారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో ఓ మీడియా సంస్థ ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. తనపై ఏదైనా హత్యాయత్నం జరిగి, దాని వెనక (మిగతా 2లో)

# చురుగ్గా వున్న మహిళలు ఈ నారీలు

## డ్వాక్రా మహిళలకు సాంకేతికత దిశగా ప్రత్యేక శిక్షణకు చర్యలు



**అమరావతి (తెలుగోడు), జనవరి 21 :**

డ్వాక్రా మహిళలను ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయిస్తూ అనేక నిర్ణయాలు తీసుకుంటున్న ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయాన్ని తీసుకుని వారికి శుభవార్త చెప్పింది. త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు కీలక బాధ్యతలు అప్పగించడానికి రెడీ అయింది. గ్రూపులోని మహిళలకు ఆధునిక సాంకేతికతను అందించేందుకు (మిగతా 2లో)

### కుక్కల గురించి కాదు...


# భర్తలను చంపుతున్నవారి సంగతేంటీ..

## రేణూదేశాయ్‌కు విహెచ్ చురకలు



**హైదరాబాద్(తెలుగోడు), జనవరి 21 :**

రేణు దేశాయ్.. అమల లాంటి వాళ్ళు కుక్కలను చంపొద్దని అంటున్నారని.. మూగ జీవుల గురించి బాగానే మాట్లాడుతున్నారు.. భర్తలను చంపుతున్న భార్యల సంఖ్య పెరుగుతుందని కాంగ్రెస్ సీనియర్ నేత హనుమంతరావు అన్నారు. ఒకప్పుడు భర్త కోసం సతిసావిత్రి యముడితో పోరాడింది.. నేడు భర్తలను భార్య.. భార్యలను భర్తలు చంపుకునేది పెరిగిందన్నారు. ఇలా చేస్తుకుంటూపోతే పిల్లల సంగతి ఏంటి..? అని ప్రశ్నించారు. తాజాగా బుధవారం మీడియాతో మాట్లాడిన వీహెచ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ అంశాలపై విద్యావంతులు.. మేధావులు ఆలోచించాలని సూచించారు. ఈ తరహా హత్యలను ఆపేందుకు ప్రయత్నం చేయాలన్నారు. మహిళా సంఘాలు కూడా సమావేశాలు పెట్టి ఆలోచించాలని సూచించారు.ఇదిలా ఉండగా.. జంతు ప్రేమికు రాలిగా, సామాజిక అంశాలపై స్పందించే వ్యక్తిగా గుర్తింపు పొందిన సినీ నటి రేణు దేశాయ్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఈసారి ఆమె ఏకంగా దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పునే సవాల్ చేస్తూ, వీధి కుక్కల (మిగతా 2లో)



# ఆశావాద జీవితంతో ఆడుగులేస్తున్నా

## భారీ లక్ష్యాల కోసం నిరంతరం పనిచేయడం నాకిష్టం

- పరిశ్రమలకు ప్రోత్సాహకాలిచ్చే విధానాన్ని అమలు చేస్తున్నాం.
- ముందుచూపుతో ప్రణాళికాబద్ధ పనితీరు..
- కష్టపడి పని చేస్తే ఏదైనా సాధ్యమని నమ్ముతా..
- దావోస్‌లో అంతర్జాతీయ మీడియాతో చంద్రబాబు..

**అమరావతి (తెలుగోడు), జనవరి 21 :**

భారీ లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి కోసం నిరంతరం పనిచేయడం తనకు అలవాటు అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. తాను ఆశావాదినని అంటూ..ముందుచూపుతో వ్యవహరించి.. వినూత్నంగా ఆలోచించి.. చిత్తశుద్ధితో కష్టపడి పని చేస్తే ఏదైనా సాధ్యమని నమ్ముతానని ఉద్ఘాటించారు. దావోస్‌లో మూడో రోజు చంద్రబాబు పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ జాతీయ, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి విషయంలో జరుగుతున్న పరిణామాలను, ప్రభుత్వ పాలసీలను మీడియా ప్రతినిధులకు వివరించారు. మాది పరిశ్రమల ఫ్రెండ్లీ ప్రభుత్వం. ఈజ్ ఆఫ్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా త్వరితగతిన అనుమతులిస్తున్నాం. పరిశ్రమలకు ప్రోత్సాహకాలిచ్చే విధానాన్ని అమలు చేస్తున్నాం. అనుమతుల నుంచి పరిశ్రమల స్థాపన వరకు ప్రతి అంశాన్ని రియల్ టైంలో మానిటర్ చేస్తున్నాం. విశాఖకు గూగుల్ కంపెనీ రాక ఏపీ అభివృద్ధిలో గొప్ప ముందడుగు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఈ విషయంలో చూపిన చొరవ, ఫాలో అప్ వల్లే ఆ పెట్టుబడి సాధించగలిగాం. (మిగతా 2లో)

# ఏపీకి రండీ.. ఇజ్రాయిల్‌కు పిలుపు




(మొదటి పేజి (తరువాయి)

సీఎం చంద్రబాబు చేరుకోనున్నారు. ఐదు రోజుల పాటు జరగనున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబుతో పాటు పలువురు మంత్రులు, ఉన్నతాధికారుల ప్రతినిధి బృందం ఆదివారం రాత్రి గన్నవరం ఎయిర్ పోర్ట్ నుంచి దావోస్ బయలుదేరి వెళ్లింది. ఈ బృందానికి యూరప్‌లో ఎన్నార్టీలు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారితో సమావేశమయ్యారు. అలాగే స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్ సైతం సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆయనతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. అందుకు సంబంధించిన అంశాలను సీఎం చంద్రబాబు తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. అలాగే దావోస్‌లో వివిధ దేశాల మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు నాయుడు వరుస భేటీలతో బిజీ బిజీగా ఉంటున్నారు. మంగళవారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్‌తో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ భేటీలో ఆయనతో పలు కీలక అంశాలను చర్చించినట్లు సీఎం చంద్రబాబు తన ఎక్స్ ఖాతా వేదికగా వివరించిన విషయం విదితమే.

# జనసేన కార్యకర్త ఇంటికి పవన్

## ప్రమాదంలో చనిపోయిన కుటుంబానికి పరామర్శ

## ప్రమాదబీమా చెక్కు అందచేత



**విజయవాడ (తెలుగోడు), జనవరి 21 :**

రోడ్డు ప్రమాదంలో చనిపోయిన జనసేన కార్యకర్త వసంతరాయలు కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించారు. పార్టీ క్రియాశీల బీమా చెక్‌ను మృతుని కుటుంబానికి స్వయంగా అందజేశారు. ఈ మేరకు ఆయన కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం పెద చందాల గ్రామంలో బుధవారం పర్యటించారు. చందు వీర వెంకట వసంతరాయలు ఇటీవల జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన జీవించి ఉండగానే అవయవదానానికి అంగీకరించారు. ఆయన మరణించినప్పటికీ ఆరుగురిలో సజీవంగా ఉంటారని పవన్ చెప్పారు. వారి కుటుంబానికి ప్రభుత్వం సహా తాను బాసటగా ఉంటానని పవన్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారుపవన్‌తో పాటు ఎమ్మెల్యేలు కాగిత కృష్ణ ప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, రామకృష్ణ, విక్కుర్తి శ్రీనివాస్.. వసంతరాయలు ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. జులైలో వసంతరాయలు రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. కుటుంబసభ్యులు వసంతరాయలు అవయవాలను దానం చేసి ఐదుగురికి కొత్త జీవితం ఇచ్చారు. అంత బాధలోనూ కుటుంబ సభ్యులు మంచి నిర్ణయం తీసుకున్నందుకు నా ధన్యవాదాలు. నేను స్వయంగా వారితో మాట్లాడి ధైర్యం చెప్పేందుకు వచ్చాను. వారి కుటుంబానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అండగా నిలబడ్డారు. ప్రభుత్వ పరంగా కూడా వారికి చేయూతను ఇవ్వాలని కలెక్టర్‌ను కోరాను. వసంతరాయలు బిడ్డకు వినికిడి లోపం ఉన్నందున ఆపరేషన్ ఉచితంగా చేయించేలా చర్యలు తీసుకుంటాం. టీటీడీ ద్వారా ఆస్పత్రిలో చికిత్సకు ఏర్పాట్లు చేస్తాం. నా రాక సందర్భంగా స్వాగతం పలికిన కూటమి నేతలందరికీ ధన్యవాదాలు' అని అన్నారు.

# చురుగ్గా వున్న మహిళలు ఈ నారీలు

(మొదటి పేజి (తరువాయి)

చంద్రబాబు సర్కార్ చర్యలు చేపట్టింది. డ్వాక్రా గ్రూపులలో పనిచేస్తూ యాక్టివ్ గా ఉండే మహిళలను ఎంపిక చేసి వారికి ఈ నారీ లుగా శిక్షణ ఇవ్వనుంది. ఆపై వారికి ప్రత్యేక బాధ్యతలను అప్పగించనుంది. ప్రస్తుతం సంఘాల వారీగా సీసీలు, ఏపీఎంలు మ్యాపింగ్ చేస్తున్నారు. ఎంపిక పూర్తి అయిన తర్వాత సిఆర్పి లతో కలిసి వారికి శిక్షణ ఇస్తారు. ఈ కొత్త కార్యక్రమం ద్వారా డ్వాక్రా మహిళలు ఆధునిక సాంకేతికతను నేర్చుకుని తద్వారా ఉపాధిని పొందడానికి వీలవుతుంది. ఈ నారీలు గా ఎంపికైన వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో వారు తమ సంఘాల కార్యకలాపాలను సులభంగా చేసుకోవడానికి వీలు అవుతుంది. ప్రస్తుతం వివరాలను సేకరిస్తున్న క్రమంలో ఎవరిని "ఈ నారీ"లు గా ఎంపిక చేయాలో నిర్ణయిస్తారు. ఎంపిక పూర్తి అయిన తర్వాత వారికి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఈ శిక్షణ కార్యక్రమాలలో వీరితోపాటు కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు కూడా పాల్గొంటారు. వారు విరికి వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఏపీలోని గ్రామాలలో ప్రతి పది మహిళా సంఘాలకు ఒక ఈ నారీని నియమిస్తారు. 25 సంఘాలు ఉన్న గ్రామాలలో ముగ్గురు వరకు అంతకంటే ఎక్కువ ఉంటే మరో ఇద్దరిని నియమించే అవకాశం ఉంది. ఇక ఎంపికలో ఎక్కువ చదువుకున్న వారికి ప్రాధాన్యతను ఇస్తారు. వారి వయసు 18 ఏళ్ల నుండి 40 సంవత్సరాల మధ్యలో ఉండాలి. పదవ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగిన వారికి ప్రాధాన్యతను ఇస్తారు. డ్వాక్రా సంఘాలకు సంబంధించి ఏర్పాటు చేసే ఈ నారీలు బ్యాంకుల ద్వారా రుణాలు అందించడం, నెలవారి వాయిదాలను సకాలంలో చెల్లించడం వంటి బాధ్యతలను నిర్వర్తిస్తారు. ఆర్థిక విషయాల పైన అవగాహన కల్పించడంతోపాటు, మహిళల జీవనోపాధికి మార్గాలను చూపిస్తారు. మన డబ్బులు మన లెక్కలు యాప్ ద్వారా ఆర్థిక వ్యవహారాలను సులభతరం చేస్తారు. ఏదిఏమైనా డ్వాక్రా మహిళలకు సంతోషం కలిగించేలా వారి ఉపాధిని పెంచేలా మరి మరి ఏపీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది.

# గణతంత్ర దినోత్సవ వేళ ఉగ్రదాడులకు ప్లాన్

**న్యూ ఢిల్లీ (తెలుగోడు), జనవరి 21 :**

గణతంత్ర దినోత్సవాన్ని లక్ష్యంగా చేసుకుని భారత్‌లో ఉగ్రదాడులు జరిగే అవకాశాలున్నాయని నిఘా వర్గాల తాజా సమాచారం. ఈ సమాచారంతో ఢిల్లీలో భద్రతా బలగాలు బుధవారంనాడు అప్రమత్తమయ్యాయి. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ ఈ ఉగ్రదాడులకు సహకరించనున్నట్టు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. జనవరి 26న దేశంలోని పలు ప్రాంతాల్లో జరిపే ఈ దాడులకు '26-26' అనే కోడ్ నేమ్ పెట్టినట్టు తెలిపాయి. దేశంలోని పలు ఆలయాలు, నగరాలతో పాటు అయోధ్యలోని రామాలయం, జమ్మూలోని రఘునాథ్ ఆలయం ఉగ్రవాదుల టా÷-గ్గ÷ట్‌లో ఉన్నట్టు భద్రతా బలగాలు తెలిపాయి. పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్, పంజాబ్ బేస్డ్ గ్యాంగ్‌స్టర్లతో ఐఎస్ఐ ఈ ఉగ్రదాడులకు ఎ÷-లాన్ చేస్తున్నట్టు పేర్కొన్నాయి. గత నవంబర్‌లో ఎర్రకోట వెలుపల జరిగిన కారుబాంబు పేలుడు ఘటన వెనుక జైషే మహ్మద్ ఉంది. కాగా, నిఘా వర్గాల సమాచారంతో అప్రమత్తమైన అధికారులు జమ్మూకశ్మీర్, ఢిల్లీ, పంజాబ్ వంటి కీలక ప్రాంతాల్లో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. అనుమానితుల పోస్టర్లను ఢిల్లీలో పలు చోట్ల ఏర్పాటు చేశారు. ప్రధానంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాల్లో వీటిని ఉంచారు. గత ఏడాది ఏప్రిల్‌లో లష్కరే తొయిబా ఉగ్రసంస్థ పహల్గాంలో జరిపిన ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. గత వారం లష్కరే సంస్థ జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదానికి కట్టుబడి ఉన్నామని బహిరంగంగా ప్రకటించింది. హిందువులకు వ్యతిరేకంగా లష్కరే కమాండర్ విద్వేషపూరిత ప్రసంగం చేశాడు. హిందువుల కుత్తుకలు కోసినప్పుడే 'ఫ్రీడం' సాధ్యమని పీఓకేలో జరిగిన ఒక కార్యక్రమంలో అబూ మూసా కశ్మీరీ చేసిన ప్రసంగం వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. పహల్గాం ఉగ్రదాడికి ముందు కూడా కశ్మీరీ ఇలాంటి వ్యాఖ్యలే చేశాడు. దీంతో భారత్‌పై దాడులకు మరింత భారీ కుట్ర చేసే అవకాశాలు ఉండవచ్చని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.

# మావోల అడ్డాలో పోలీసుల పాగా

## కర్రెగుట్టలో వెలసిన సిఆర్‌పిఎఫ్ క్యాంప్

**ములుగు (తెలుగోడు), జనవరి 21 :**

దశాబ్దాలుగా మావోయిస్టులకు సురక్షిత ప్రాంతంగా, వారి ఆయుధ కర్మాగారాలకు , ముఖ్య నాయకులకు షెల్టర్ జోన్‌గా ఉన్న ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని కర్రెగుట్ట అటవీ ప్రాంతం ఇప్పుడు పోలీసుల అధీనంలోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న మావోయిస్టు రహిత భారత్ లక్ష్యంలో భాగంగా, వెంకటాపురం మండలం పామునూరు గ్రామ పరిధిలోని కర్రెగుట్టలపై నూతనంగా ఎఫ్.ఓ.బి బేస్ క్యాంప్‌ను అధికారులు ప్రారంభించారు. సి.ఆర్.పి.ఎఫ్ 39వ బెటాలియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ బేస్ క్యాంప్‌ను సి.ఆర్.పి.ఎఫ్ ఐజీ త్రివిక్రమ్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇది దేశ భద్రతా చరిత్రలో ఒక గొప్ప రోజని అభివర్ణించారు. తెలంగాణ ప్రభుత్వ చొరవతో, మురుమూరు బేస్ క్యాంప్ ఏర్పాటు చేసిన కేవలం రెండు నెలల వ్యవధిలోనే దుర్భేద్యమైన కర్రెగుట్టలపై పట్టు సాధించి ఈ రెండో క్యాంప్‌ను ఏర్పాటు చేయడం విశేషమని ఆయన కొనియాడారు. ఈ బేస్ క్యాంప్ ఏర్పాటు వెనుక అధికారుల , ఇంజనీర్ల అలుపెరగని కృషి దాగి ఉంది. వాజేడు మండలం మొరుమూరు బేస్ క్యాంప్ నుండి కర్రెగుట్టల వరకు సుమారు 8.3 కిలోమీటర్ల మేర దట్టమైన అటవీ ప్రాంతంలో రహదారిని నిర్మించారు. భారీ యంత్రాలు, క్రేన్ల సహాయంతో గుట్టలపై విశాలవంతమైన రహదారిని నిర్మించడానికి అధికారులు సుమారు 50 రోజుల పాటు అహోరాత్రులు శ్రమించారు. ఈ రహదారి నిర్మాణం పూర్తి కావడంతో ఇప్పుడు బలగాల రాకపోకలు సులభతరం కావడమే కాకుండా, మావోయిస్టుల కదలికలకు అడ్డుకట్ట పడింది. బేస్ క్యాంప్ ప్రారంభం అనంతరం ఐజీ విక్రమ్ పామునూరు గ్రామస్తులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న రోజుల్లో జెల్లా, డోలి, తడపాల మీదుగా మరిన్ని రహదారులు నిర్మించి బేస్ క్యాంప్‌లను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. మావోయిస్టుల ముఖ్య క్యాడర్ ఇప్పటికే లొంగిపోయారని, ప్రస్తుతం కొన్ని చిన్న పార్టీలు మాత్రమే మిగిలి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వారు కూడా తెలంగాణ పోలీసులు పిలుపునిచ్చిన 'పోరు కన్నా ఊరు మిన్న' కార్యక్రమం ద్వారా లొంగిపోయి, ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాసాన్ని అందిపుచ్చుకుని జనజీవన స్రవంతిలో కలవాలని ఆయన పిలుపునిచ్చారు.

కర్రెగుట్టల నుంచి పలు గ్రామాల దిశగా రహదారి పనులు చకచకా సాగుతుండటంతో స్థానిక గిరిజన గ్రామాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ పథకాలు నేరుగా తమ దరికి చేరుతాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల రాకతో భద్రతా భావం పెరిగిందని, కర్రెగుట్టలు ఇకపై మావోయిస్టుల స్థావరాలుగా కాకుండా అభివృద్ధికి కేంద్రాలుగా మారుతాయని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# నల్లమాడ అభివృద్ధికి 'దారి'చూపే నిర్ణయం

## ప్రధాన రహదారి వెడల్పుతో సమగ్ర అభివృద్ధి.... మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి చొరవతో రోడ్డు వెడల్పు జరిగే అవకాశం..

**బాబ్‌జాన్... మా... ......... తెలుగోడు, జనవరి 21 :**

శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రానికి అతి దగ్గరలో వున్న మండల కేంద్రమైన నల్లమాడలో ప్రధాన రహదారి వెడల్పు అంశం గ్రామ భవిష్యత్తును నిర్దేశించే కీలక నిర్ణయంగా మారుతోంది. గ్రామం వెలుపల బైపాస్ దారిని ఏర్పాటు చేయడం కంటే, ప్రస్తుత ప్రధాన దారినే విశాలంగా అభివృద్ధి చేయాలన్న దిశగా సానుకూల చర్చలు కొనసాగుతున్నాయి. ఈ నిర్ణయం గ్రామ ఆర్థిక పురోగతికి, వాణిజ్య విస్తరణకు బలంగా మారనుందని చెప్పుకోవచ్చు. ప్రస్తుతం ఉన్న రహదారిని ఒక్కో వైపు సుమారు 15 అడుగుల మేర విస్తరించే అవకాశాలు పరిశీలనలో ఉన్నాయి. బడవాండ్లపల్లి నుంచి నల్లమాడ వైయస్సార్ సర్కిల్ వరకు రోడ్డు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేసి, బటర్‌ఫ్లై లైట్స్‌తో ప్రధాన దారిని అత్యాధునికంగా, అన్ని వసతులతో అందంగా తీర్చిదిద్దే ప్రణాళికలు రూపొందుతున్నాయి. దీని వల్ల ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు పట్టణానికి ఆకర్షణీయమైన రూపు రానుంది. ఈ అభివృద్ధి యత్నాల్లో పల్లె రఘునాథ్ రెడ్డి చొరవ ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో ఆయన హయాంలోనే నల్లమాడ ప్రధాన రహదారి వెడల్పు చేసి గ్రామానికి కొత్త రూపు ఇచ్చిన అనుభవం ఉంది. ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో మరింత అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయని స్థానికులు భావిస్తున్నారు. కాగా ప్రధాన వీధిలో నివాసాలు ఉన్న ఇంటి యజమానులు రోడ్డు వెడల్పుకు సహకరించాల్సిన అవసరం ఉంది. విశాలమైన రహదారి ఏర్పడితే ఇళ్ల విలువ పెరగడంతో పాటు ట్రాన్స్‌పోర్ట్ రద్దీ పెరిగి వ్యాపారాలు మరింత విస్తరించే అవకాశం ఉంది. ఇది దీర్ఘకాలంలో నల్లమాడకు సమగ్ర అభివృద్ధిని తీసుకొస్తుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. దీంతో ప్రధాన దారిలోని ఇళ్ళ యజమానులు కూడా సహకరిస్తారని తెలుస్తోంది. ఒకవేళ ఇళ్ల యజమానులు రహదారి వెడల్పుకు సహకరించకపోతే గ్రామం వెలుపల బైపాస్ దారిని ఏర్పాటు చేసే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. ఇదే గనుక జరిగితే నల్లమాడ గ్రామ అభివృద్ధి మరింత క్షీణించే అవకాశం ఉంది. అన్ని రకాలుగా బలహీనపడే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో ప్రధాన దారిలోని ఇళ్ల యజమానులు, గ్రామ పెద్దలు సరైన నిర్ణయం తీసుకొని గ్రామంలోని ప్రస్తుతమున్న దారిని వెడల్పు చేసే దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం రోడ్డు వెడల్పుపై చర్చలు కొనసాగుతున్నప్పటికీ, గ్రామ హితమే లక్ష్యంగా తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుత ప్రధాన రహదారినే విస్తరించాలన్న అభిప్రాయానికి గ్రామస్థుల నుంచి విశేష మద్దతు లభించే అవకాశం కనిపిస్తోంది. గ్రామ అభివృద్ధి, వాణిజ్య వృద్ధి, రవాణా సౌలభ్యం అన్నింటినీ సమన్వయం చేస్తూ ప్రధాన రహదారి వెడల్పు చేయడం నల్లమాడ భవిష్యత్తుకు దోహదపడే నిర్ణయమని చెప్పుకోవచ్చు. గతంలో కొంతవరకు జరిగిన అభివృద్ధిలాగే, ఈసారి కూడా సమన్వయంతో ముందుకు సాగితే నల్లమాడ మరో అభివృద్ధి అధ్యాయాన్ని ప్రారంభించనుందన్న విశ్వాసం వ్యక్తమవుతోంది.



పల్లె రఘునాథరెడ్డి, మాజీ మంత్రి..



నల్లమాడలోని ప్రస్తుత ప్రధాన రహదారి



రోడ్డును వెడల్పు చేసి సుందరంగా తీర్చిదిద్దినప్పుడు కనిపించే నల్లమాడలోని ప్రధాన రహదారి

# చట్టబద్ధతకు రంగం సిద్ధం

(మొదటి పేజి (తరువాయి)

సమర్పించింది. తేదీ నుంచి కేంద్ర హోం శాఖ అడిగిన సమాచారం ఇవ్వటంతో పాటుగా తేదీ పైన స్పష్టత ఇచ్చింది. 2024 జూన్ 2 నుంచే రాజధానిగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఏపీ ప్రభుత్వం నుంచి వచ్చిన అభ్యర్ధన పైన కేంద్ర హోం శాఖ సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖలను అభిప్రాయాలు కోరింది. కాగా.. కేంద్ర మంత్రిత్వ శాఖలు తమ అభిప్రాయాలను వెల్లడించాయి. ఇంకా పట్టణాభివృద్ధి, న్యాయశాఖలు తమ అభిప్రాయాలు వెల్లడించాల్సి ఉంది. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే రాజధాని ప్రకటించేందుకు చర్యలు తీసుకున్నట్లు సమాచారం. దీనికి ముందే మరోసారి ఏపీ ప్రభుత్వంతోనూ చర్చించనుంది. పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టేముందు క్యాబినెట్లో చర్చించి తుది ఆమోదం ఇవ్వనున్నారు. ఈ మేరకు క్యాబినెట్ నోట్ తయారీలో హోంశాఖ నిమగ్నమైనట్లు అధికార వర్గాల సమాచారం. తాజాగా అమరావతి రైతులు సైతం ఇదే అంశం పైన ఏపీ ప్రభుత్వం వద్ద ప్రస్తావించారు. ప్రభుత్వం మారినా.. అమరావతే రాజధానిగా కొనసాగే విధంగా చట్టబద్ధత కావాలని డిమాండ్ చేసారు. ఏపీ ప్రభుత్వం కేంద్రంతో చేసిన సంప్రదింపులు.. చర్చల ఫలితంగా ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ఏపీ రాజధానిగా అమరావతికి రాజ ముద్ర ఖాయంగా

# హెరిటేజ్ పాలకంటే భూమి ధరలు తక్కువ

(మొదటి పేజి (తరువాయి)

అని ప్రశ్నించారు. అమరావతి ప్రాంతంలో కూటమి నాయకులు, వారి బినామీల పేర పెట్టుకుని దోపిడీకి శ్రీకారంచుట్టారని మండి పడ్డారు.

చెప్పింది ఆచరించటం, చేసేదే చెప్పడం వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ సిద్ధాంతం అన్నారు. మాట నిలబెట్టుకోవడం కోసం కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా జగన్ ప్రజా సంక్షేమం కోసం పనిచేశారన్నారు. కూటమి ముఠా చేస్తున్న పనులను ప్రజలు గమనిస్తున్నారని కూటమికి ప్రజలే గుణపాఠం చెప్తారని కన్నబాబు మండిపడ్డారు.

# నాకేమైన జరిగితే ఇరాన్ ఔట్

(మొదటి పేజి (తరువాయి)

ఇరాన్ హస్తం ఉందని తేలితే.. ఆ దేశాన్ని తుడిచిపెట్టేయాలని తన సలహాదారులను ఆదేశించినట్లు ట్రంప్ ఇప్పటికే ఓసారి వ్యాఖ్యలు చేశారు. తాజాగా మరోసారి అదేతరహా హెచ్చరికలు చేశారు. కాగా.. డిసెంబర్ నుంచి పాలకులకు వ్యతిరేకంగా ఇరాన్ ప్రజలు నిరసనలు చేపడుతున్నారు. దీంతో తమ దేశంలో నెలకొన్న ఆందోళనలకు అమెరికా అధ్యక్షుడే కారణమని ఆయతుల్లా అలీ ఖమేనీ ఆరోపించగా.. ఇరాన్‌లో కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని ఆ నిరసనకారులకు ట్రంప్ మద్దతు పలుకుతున్న సంగతి తెలిసిందే. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఖమేనీ పాలన అంతం కావాలని పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలపై ఇరాన్ (ఎసజీని) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ నాయకుడే లక్ష్యంగా ఏదైనా దురాక్రమణ జరిగితే.. దానిని తాము దీటుగా ఎదుర్కొంటామని హెచ్చరించింది. ఇక ఈ నిరసనల్లో 5వేల మంది మృతి చెందినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. 26వేల మంది వరకు అరెస్టయినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ మరణాలకు అమెరికానే కారణమని ఖమేనీ నిందించారు.

# ఆశావాద జీవితంతో అడుగులేస్తున్నా

(మొదటి పేజి (తరువాయి)

వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగంతో పరిస్థితులు పూర్తిగా మారుతున్నాయి. రాష్ట్రంలో అగ్రిటెక్ విధానాన్ని అమలు చేస్తున్నాం. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా గురించి అంతా చర్చిస్తున్న సమయంలోనే ఏపీలో ఉత్పత్తికి అడుగులు వేస్తున్నాం. విదేశాలకు గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి ఎగుమతి చేసేందుకు ఇప్పటికే ఒప్పందాలు జరిగాయి. 30 ఏళ్ల కిందటే దేశ అభివృద్ధిలో కీలక అడుగులు పడ్డాయి. ఇప్పుడు సంస్కరణలను అందిపుచ్చు కుంటున్నాం. అవే రాష్ట్రంలోని యువతకు అవకాశాలు కల్పించాయి. టెక్నాలజీ, గ్రీన్-బ్లూ సిటీగా అమరావతిని నిర్మిస్తున్నాం. ఏపీలో గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ ఏర్పాటు చేయాలనేది నా ఆలోచన. ఏపీ అమలు చేస్తున్న విధానాలను, ఆలోచనలను, వేగంగా తీసుకుంటున్న నిర్ణయాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. ఆ స్థాయిలోనే పారిశ్రామిక రంగం ఏపీ గురించి చర్చించుకుంటోంది. చైనా, జపాన్ సహా అనేక దేశాల్లో ఉన్న ఏజింగ్ సమస్య భారత్‌కు లేదు. సమర్థ మానవ వనరులు, టెక్నాలజీ భారత్ అదనపు బలం' అని చంద్రబాబు అన్నారు.


# భర్తల్ని చంపుతున్న వారి సంగతేంటీ

(మొదటి పేజి (తరువాయి)

హత్యలపై తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కుక్కలను వ్యతిరేకిస్తూ వాటిని చంపాలని చూస్తున్న వారికి 'పిచ్చి పట్టింది' అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. వీధి కుక్కల విషయంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై రేణు దేశాయ్ కఠినంగా స్పందించారు. 'మొత్తం న్యాయం అనేది ఒక జోక్ అయిపోయింది. దానికి నేనే సాక్ష్యం' అంటూ ఆమె తీవ్రమైన విమర్శలు చేశారు. ఈ తీర్పు ఇచ్చిన జడ్జికి కుక్కల మీద ఏదైనా వ్యక్తిగత ద్వేషం ఉండి ఉండవచ్చని, ఇది మానవత్వంతో ఇచ్చిన తీర్పు కాదని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. ఈ అంశంపై తాజాగా వీహెచ్ స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

# రథ సప్తమికి ప్రత్యేక సేవలు

**తిరుమల (తెలుగోడు), జనవరి 21 :**



ఈ నెల 25న రథ సప్తమిని వైభవంగా నిర్వహించాలని తితిదే ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో బుధవారం తితిదే అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి జిల్లా, తితిదే అధికారులతో శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. రథ సప్తమి నేపథ్యంలో స్వామివారి ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలు రద్దు చేశారు. ఎన్ఆర్ఐలు, చంటి బిడ్డల తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లు, దివ్యాంగుల ప్రివిలేజ్ దర్శనాలూ నిలిపివేస్తున్నట్లు తితిదే వెల్లడించింది. తిరుపతిలో జనవరి 24 నుంచి 26 వరకు స్లాటెడ్ దర్శనం టోకెన్ల జారీని రద్దు చేస్తన్నట్లు పేర్కొంది. ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయడంతోపాటు బ్రేక్ దర్శనాలకు సంబంధించి జనవరి 24న ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించబోమని తితిదే తెలిపింది. భద్రత, పార్కింగ్, అన్నప్రసాదాలు, లడ్డూలు, రద్దీ నిర్వహణ, స్వచ్ఛ కార్యక్రమాలు, అత్యవసర సేవల విషయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భక్తులను ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, గ్యాలరీల్లో, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. రథసప్తమి రోజున వాహన సేవల వివరాలు.. ఇలావున్నాయి. తెల్లవారుజామున 5.30 నుంచి 8 గంటల వరకు సూర్యప్రభ వాహనం, ఉదయం 9 నుంచి 10 గంటల వరకు చిన్నశేష వాహనం ఉంటుంది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గరుడ వాహనం తరవాత మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు హనుమంత వాహనం నిర్వహిసతారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు చక్రస్నానం చేపడతారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కల్పవృక్ష వాహనం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8 నుంచి 9 గంటల వరకు చంద్రప్రభ వాహనంతో ముగుస్తుంది.

తెలుగోడు

అనంతపురము

గురువారం
22 జనవరి, 2026



# 25న ఉచిత కంటి మెగా వైద్యశిబిరం

**ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు.. అధ్యక్షులు రఘువీర్ రావు ..**





**పామిడి (తెలుగోడు), జనవరి 21 :**
పట్టణంలోని శ్రీ భావసార క్షత్రీయ కళ్యాణ మండపంలో ఈనెల 25వ తేదీ ఉచిత కంటి మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి, లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, అధ్యక్షులు రఘువీర్ రావు బుదవారం తెలిపారు. బెంగుళూరు శంకరకంటి ఆసుపత్రి వైద్యనిపుణులు కంటిచూపు మందగించిన వారిని పరీక్షించి ఉచితంగా మందులను అందజేస్తూ అవసరమైతే ఆపరేషన్లకు రెఫర్ చేసి అసుపత్రి వారే ప్రత్యేక బస్సుల్లో బెంగుళూరుకు తీసుకెళ్ళి ఆపరేషన్ల అనంతరం తిరిగి గమ్యస్థానాలకు చేరుస్తారని తెలియజేశారు. కంటి వైద్యశిభిరానికి హాజరయ్యే వారు ఆదారుకార్డు జిరాక్స్ రెండు పాసుపోర్టుసైజు ఫోటోలు తీసుకుని రావాలని, పామిడి మండల ప్రజలు ఉచిత కంటి మెగా వైద్యశిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, రఘువీర్ రావు కోరారు.



వికసిత్ భారత్ పథకంపై వివరిస్తున్న అధికారి

# వికసిత్ భారత్ పథకంపై అవగాహన

**బిజెపి నాయకులు వద్ది రాజశేఖర్..**

**యాడికి (తెలుగోడు), జనవరి 21 :**
యాడికి వ ఎంపీడీవో సమావేశ భవనంలో బుధవారం భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు వద్ది రాజశేఖర్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ జీ గ్యారంటీ రామ్ జీ పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు బిజెపి పార్టీ నేతలు, ఎం.పీ.డీ.వో వీర రాజు. ఏపీవో మద్దిలేటి. హౌసింగ్. ఏ.ఈ లోకేష్ కుమార్ .ఈశ్వర్ రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికసిత్ భారత్ జీ గ్యారంటీ రామ్ జీ పథకం పేదలకు వరం లాంటిందనీ , ప్రధాని నరేంద్ర మోడీ పేద కుటుంబం నుంచి ఈ స్థాయికి అభివృద్ధి పొందినట్లు, అందువలన నిరుపేదలకు న్యాయం చేయాలనే అంకితభావంతో కృషి చేస్తున్నట్లు వక్తలు పేర్కొన్నారు . గ్రామీణ ప్రజలకు ఏడాదికి 125 ఉపాధి పని దినాలు కల్పించిన ఘనత మోడీదేనని వారన్నారు.
అవినీతిని కట్టడి చేసేందుకు కూలీలు పని చేసే చోట హాజరు నుండి జీతం చెల్లింపుల వరకు డిజిటల్ బయోమెట్రిక్ విధానం అవలంభిస్తున్నట్లు తెలిపారు. రైతులు వ్యవసాయం చేసే కాలంలో కూలీల కొరతను తీర్చడం ద్వారా రైతులకు ఉపశమనం కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు పండు లక్ష్మీదేవి మురళీకృష్ణ . కేత వెంకటరమణ .రంగస్వామి. జక్కరామయ్య. కిట్టు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన ఫీల్డ్ అసిస్టెంట్ టెక్నికల్ అసిస్టెంట్లు

# మడకశిర నియోజకవర్గంలో చారిత్రాత్మక ఘట్టం

***10 వేల కుటుంబాలకు ఇళ్ల పట్టాల పంపిణీ.. మండల పార్టీ అధ్యక్షులు జి కె ఈరన్న..***

**రోళ్ల,(తెలుగోడు)జనవరి 21 :**
మడకశిర జూనియర్ కళాశాల అవరణంలో ఈనెల 23 న శుక్రవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారాలోకేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని మడకశిర శాసనసభ్యులు యమ్.యస్ రాజు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అధ్వర్యంలో నియోజకవర్గంలోని నిరుపేదలకు 10 వేల కుటుంబాలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తునట్లు మండల పార్టీ అధ్యక్షులు జి కె ఈరన్న తెలిపారు. కనుక రొళ్ల మండలంలోని నాయకులు తెదేపా కుటుంబ సభ్యులు. లబ్ధిదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



# 23న సన్ రైజర్స్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస వేడుక

**వసంత పంచమి సందర్భంగా సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు.. పాఠశాల కరస్పాండెంట్ మారెన్న..**

**బెళగుప్ప (తెలుగోడు), జనవరి 21 :**
మండల కేంద్రమైన బెళుగుప్ప లోని సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలోఈ నెల 23 వ తేదీ రేపు శుక్రవారం వసంత పంచమి (శ్రీపంచమి)ని పురస్కరించుకొని అర్చకుల చేత చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస వేడుక నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ మారెన్న, డైరెక్టర్లు నాగభూషణ, తిప్పేస్వామి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మారెన్న మాట్లాడుతూ మాఘ శుద్ధ పంచమిని వసంత పంచమిగా వ్యవహరిస్తారని, వసంత పంచమి రోజు విద్యాధిదేవత యిన శ్రీ సరస్వతీ మాత జన్మించిన రోజు కావడంతో విశిష్ట పర్వదినమున అక్షరాభ్యాసం చేయించుకున్న చిన్నారుల్లో గ్రహణశక్తి, జ్ఞాపకశక్తి,మేధాశక్తి, పెంపొంది చక్కటి విద్యావంతులు కాగలరని నమ్మకం. మాఘశుద్ధ పంచమి నాడు పరమమైన చైతన్యాన్ని సరస్వతీదేవిగా ఆరాధించే సాంప్రదాయం మనకు ఋషి సంస్కృతి ద్వారా అందజేయబడిందని, సర్వ జగత్తుకి కారణమైన ఆ పరమేశ్వర చైతన్యాన్ని వారు సర్వవిద్య స్వరూపిణిగా దర్శించారు, వారి దర్శనమే మనకు జ్ఞానం, ఈ పంచమినే శ్రీ పంచమిగా వసంత పంచమిగా వ్యవహరిస్తారన్నారు.



సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం వివరాలను వెల్లడిస్తున్న సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ మారెన్న

ఈ విశిష్టమైన రోజు న ప్రతి సంవత్సరం సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పాఠశాల యాజమాన్యం సరస్వతీ పూజ నిర్వహించి చిన్నారులకు అర్చకుల చేత ఉచితంగా అక్షరాభ్యాస కార్యక్రమం చేయిస్తున్నారు. అందులో భాగంగానే ఈ నెల 23వ తేదీ రేపు శుక్రవారం పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కావున ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల కరస్పాండెంట్ మారెన్న కోరారు...

# ఘనంగా శ్రీ అంకాలమ్మ శ్రీ కుంటెమ్మ జాతర

**ప్రతిఏటా రాతిదూలం పోటీలకు సహకారం.. టిడిపి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్.. రాతిదూలం పోటీల మొదటి విజేతకు రూ.50 వేలు అందజేత..**

**పామిడి (తెలుగోడు), జనవరి 21 :**
పట్టణ శివారుప్రాంతం కొండూరు రోడ్డులో వెలసిన శ్రీ అంకాలమ్మ శ్రీ కుంటెమ్మ అమ్మవార్ల జాతర ఘనంగా ప్రారంభమైంది. భక్తులు అత్యంత భక్తిశ్రద్దలతో పూజలు చేపట్టి తీర్థప్రసాదాలను స్వీకరిస్తూ అమ్మవార్ల కృపకు పాత్రులయ్యారు. ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీ అంకాలమ్మ శ్రీ కుంటెమ్మ అమ్మవార్లను దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులతో దేవాలయ ప్రాంతం కిటకిటలాడింది. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రాతిదూలపు పోటీలను గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు టిడిపి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ప్రారంభించారు. రాతిదూలపు పోటీల్లో మొదటి విజేతకు రూ.50 వేలు ఇవ్వాలని నిర్వాహకులకు అందజేస్తూ ప్రతిఏటా తనవంతు సహకరం అందిస్తానని తెలిపారు. జాతరను పురస్కరించుకుని కొన్నేళ్ళుగా ఇక్కడ రాతిదూలం పోటీలను జరపడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు టిడిపి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు.



రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న గుమ్మనూరు ఈశ్వర్





రూ.50 వేలు నిర్వాహకులకు అందజేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్. గుమ్మనూరు ఈశ్వర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

# ఇంటి స్థల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి**

**గుడిబండ, జనవరి 21.**
మడకశిర పట్టణంలోని ఈ నెల 23వ తేదీన జరుగు ఇంటి స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తేదేపా రాష్ట్ర కార్యదర్శి డి. శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. గుడిబండ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం వెలుగు సిబ్బంది,మహిళ సంఘాల సభ్యుల ప్రతినిధులు, యానిమేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లా ఆదేశాల మేరకు ఈనెల 23వ తేదీన మంత్రి నారా లోకేష్ జన్మదిన పురస్కరించుకొని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాల పట్టాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ హాజరవుతారని, ఈ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా ఇళ్ల లబ్ధిదారులు హాజరయ్యే విధంగా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ నాగరాజు,,సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, జిల్లా వీరశైవ లింగాయత్ సాధికార అధ్యక్షుడు దుర్గేష్, క్లస్టర్ ఇంచార్జ్ బాలేపల్లి రాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు భీమ్ రాజు, షబ్బీర్, జయ రాము తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసమూర్తి

# గుత్తి రైల్వేస్టేషన్ మేనేజర్ ఏ.సురేష్ బాబుకు జిఎం అవార్డు

**గుత్తి (తెలుగోడు), జనవరి 21 :**
గుంతకల్లు డివిజన్ పరిధిలోని గుత్తి రైల్వే స్టేషన్ మేనేజర్ ఏ. సురేష్ బాబుకు 2025 సంవత్సరానికి సంబంధించి విశిష్ట రైలు సేవా పురస్కారం జనరల్ మేనేజర్ అవార్డు లభించింది. ఈ మేరకు సికింద్రాబాద్ జనరల్ మేనేజర్ కార్యాలయం నుండి ఎంపికైన అధికారుల జాబితాను విడుదల చేశారు. ఈ నేపథ్యంలో గుంతకల్ రైల్వే డివిజన్ పరిధిలోని ఉత్తమ పనితనాన్ని కనపరిచిన గుత్తి రైల్వే స్టేషన్ మేనేజర్ ఏ.సురేష్ బాబుకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా సురేష్ బాబు కు ఉన్నత రైల్వే అధికారులు, సహా ఉద్యోగులు మరియు యూనియన్ నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు. తన పనితనాన్ని గుర్తించి తనకు అవార్డు ఇవ్వడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈయనకు గతంలో కూడా గుంతకల్ డివిజన్ సేఫ్టీ అవార్డు కూడా లభించాయి. ఈ సందర్భంగా తనకు అభినందనలు తెలిపిన అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.





అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న గడ్డివాములు

# గడ్డి వాముల దగ్ధం

***4.రూ. లక్షల ఆస్తి నష్టం..***

**గుత్తి (తెలుగోడు), జనవరి 21 :**
పట్టణ శివారులోని బీసీ కాలనీ సమీపంలో బుధవారం మధ్యాహ్నం 8 గడ్డివాములు దగ్ధమయ్యాయి. సంఘటనలో సుమారు నాలుగు లక్షల రూపాయల మీరు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. గుత్తి పట్టణానికి చెందిన హరికృష్ణ రవి కృష్ణ తిమ్మారెడ్డి తో పాటు మరో వ్యక్తికి చెందిన 8 గడ్డివాములకు మధ్యాహ్న సమయంలో నిప్పంటుంది.. గడ్డివాములకు పెద్ద ఎత్తున మంటలు చెలరేగి ఒక్కసారిగా గడ్డివాములో దగ్ధమైపోయాయి. సమాచారం అందుకున్న స్థానికులు మంటలు అదుపు చేసేందుకు చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. దీంతో తమకు నాలుగు లక్షల రూపాయలు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధ్యతలు తెలిపారు.



గోపాల్ ఇంటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కాలిపోయి వస్తువులు

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్ 2 లక్షల ఆస్తి నష్టం

**యాడికి (తెలుగోడు), జనవరి 21 :**
యాడికి మండల పరిధిలోని చందన గ్రామంలో బుధవారం రజక వృత్తి జీవనం చేసే యలమకూరు గోపాల్ ఇంటి నందు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఇంట్లో ఉన్న వస్తువులు బట్టలు కాలిపోవడంతో దాదాపు రెండు లక్షల నష్టం సంభవించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తాము రజక అభివృద్ధితో జీవనం చేస్తున్నట్లు దాదాపు రైతులకు రైతుల నుండి పది కుటుంబాల నుండి దుస్తులు టీవీ తమ ఇంటిలోని సామానులు షార్ట్ సర్క్యూట్తో దద్దమైనట్లు దాదాపు రెండు లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు గోపాల్ వాపోయాడు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నట్లు వారు పేర్కొన్నారు.

# మీ నిర్లక్ష్యం ఇంటిల్లిపాదికి శాపం

**జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్..**

**ధర్మవరం (తెలుగోడు), జనవరి 21 :**
మీ జీవితం ఎంతో విలువైనదని, రోడ్డు మీద క్షణిక నిర్లక్ష్యం మొత్తం కుటుంబాన్ని అంధకారంలోకి నెట్టేస్తుందని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ప్రజలకు హెచ్చరించారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవడమే కాకుండా కుటుంబ భద్రతను కూడా నిర్ధారించుకోవచ్చని ఆయన తెలిపారు. ధర్మవరం పట్టణంలో బుధవారం జిల్లా పోలీస్ శాఖ, జిల్లా రవాణా అధికారులతో కలిసి హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించే బైక్ ర్యాలీని నిర్వహించారు. నాలుగు కిలోమీటర్ల మేర జరిగిన ఈ ర్యాలీలో జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని, ధర్మవరం పోలీస్ సబ్ డివిజన్ అధికారులు, సిబ్బంది, రవాణా శాఖ అధికారులతో కలిసి హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ చేపట్టారు.
ధర్మవరం వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజలతో సమావేశమైన జిల్లా ఎస్పీ, జిల్లా రవాణా అధికారి కరుణ సాగర్ రెడ్డి, డీఎస్పీ హేమంత్ కుమార్?లతో కలిసి హెల్మెట్ ప్రాముఖ్యతపై విస్తృతంగా వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 2025 సంవత్సరంలో




హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్

జిల్లాలో మొత్తం 555 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా, అందులో 190 ప్రమాదాలు ద్విచక్ర వాహనాలకు సంబంధించినవేనని తెలిపారు. ఈ ద్విచక్ర వాహన ప్రమాదాల్లో 120 మంది ప్రాణాలు కోల్పోయారని, ఇది అత్యంత ఆందోళనకరమైన అంశమని అన్నారు. అనేక రోడ్డు ప్రమాదాల్లో మృతికి ప్రధాన కారణం హెల్మెట్ ధరించకపోవడమేనని ఎస్పీ స్పష్టం చేశారు. భవిష్యత్తులో హెల్మెట్?ను తప్పనిసరి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని, అందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా ముందుగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వాహనాలు నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం ప్రమాదకరమని, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాంతకమని హెచ్చరించారు. వేగం కంటే క్షేమమే ముఖ్యమని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల జరగరాని సంఘటనలు జరిగితే కుటుంబాలు వీధిన పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆలోచించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఇలాంటి అవగాహన కార్యక్రమాలను మరింత ముమ్మరం చేస్తామని తెలిపారు. హెల్మెట్ ధరించండి మీ ప్రాణాలను కాపాడుకోండి, మీ కుటుంబానికి భద్రత కల్పించండి అని జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్

# మలేరియా జ్వరాలపై ప్రజలకు అవగాహన

**మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు..**

**యాడికి (తెలుగోడు), జనవరి 21 :**
యాడికి మండల కేంద్రంలోని సచివాలయం 5 పరిధిలోని కాలనీలలో ప్రజలకు మలేరియా విష జ్వరాలపై మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు అవగాహన కలిగించారు. జిల్లా మలేరియా అధికారి డి ఓబుల్ ఆదేశాల మేరకు యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరమేశ్వర్. డాక్టర్ సాయి సుమంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు యాడికి ఐదో సచివాలయం నందు ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే తనిఖీ చేయడం జరిగినది అలాగే వార్డు నందు ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత గురించి వివరించి మలేరియా డెంగ్యూ టైఫాయిడ్ చికెన్ గునియా జ్వరాలు మీద అవగాహన కల్పించింది మరియు ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే తప్పక చేయవలెనని వార్డ్ నందు ప్రజలు తెలియజేయడం జరిగినది అలాగే అంగన్వాడి స్కూల్ నందు పిల్లలకు తినిపించు మధ్యాహ్న భోజనం పరిశీలించి అంగన్వాడి ఆయాకు తగు సూచనలు సలహాలు తెలియజేయడం జరిగింది అలాగే అంగన్వాడి స్కూల్ నందు యూనివర్సల్ ఇమేజెస్ ప్రోగ్రామ్ నందు అక్కడికి వచ్చిన గర్భవతులకు బాలింతలకు తప్పక పిల్లలకు వ్యాక్షన్స్ వేయించాలని తెలియజేయడం జరిగినది ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు యాడికి ఐదో సచివాలయం ఎం పీ హెచ్ ఏ ఫిమేల్ స్వర్ణలత ఎమ్ ఎల్ హెచ్ పి శ్వేతా మాధురి ఆశా కార్యకర్తలు సుజాత మహబూబ్బి వరలక్ష్మి పద్మావతి మొదలగువారు పాల్గొన్నారు.



అంగన్వాడి కేంద్రంలో మధ్యాహ్నం భోజనం పరిశీలిస్తున్న తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు





విష జ్వరాలపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్న దృశ్యం. అనుమానం ఉన్న వ్యక్తులకు రక్త పరీక్ష నిర్వహిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు



జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్‌ను అభినందిస్తున్న టిడిపి నేతలు

## గ్రంథాలయసంస్థ చైర్మన్ వడ్డే వెంకట్‌కు అభినందనలు

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 21 :** ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వడ్డే వెంకట్‌కు పలువురు అభినందనలు తెలిపారు. బుధవారం అనంతపురం పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో ఉమ్మడి చైర్మన్గా ప్రమాణ స్వీకారం చేసిన వడ్డే వెంకట్ ను టిడిపి కుమ్మర శాలివాహన సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మదనాపు పోతలయ్య,కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగులకుంట రమణ,డేరంగుల ప్రతాప్,సాకే వీర తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేలు అందజేసి అభినందనలు తెలిపారు.



ప్రమాదంలో ముందు భాగం దెబ్బతిన్న కారు

## జాతీయ రహదారిపై కారు ప్రమాదం

### తప్పిన ప్రాణాపాయం..

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 21 :** అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై బత్తలపల్లి మండల పరిధిలోని ఈదుల ముష్టూరు క్రాస్ వద్ద బుధవారం కారు ప్రమాదానికి గురైంది. ధర్మవరానికి చెందిన గూండా రామాంజనేయులు, ఆయన భార్య గూండా అర్చన కారులో అనంతపురం వైపు ప్రయాణిస్తుండగా ముష్టూరు క్రాస్ వద్ద కారు అదుపుతప్పి రహదారి డివైడర్‌ను ఢీకొంది. అదే సమయంలో వెనుక నుంచి ఇతర వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న దంపతుల కు ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డారు. అయితే ప్రమాదం కారణంగా కారుకు ముందుభాగంలో తీవ్ర నష్టం వాటిల్లింది.సమాచారం అందుకున్న బత్తలపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఓ ఓబుళప్ప


## ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం

**రొళ్ల (తెలుగోడు), జనవరి 21 :** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఏపీఓ ఓబుళప్ప ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బంది తో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశం లో అన్ని జీపీ లలో కూలీల శాతం పెంచాలని, మెటీరియల్ బిల్స్ అన్ని కూడా రికార్డు చేసి అప్లోడ్ చేయించాలని సిబ్బంది కి తెలియజేశారు.సామాజిక తనిఖీ బృందానికి సహకరించి విజయవంతానికి కృషి చేయాలన్నారు.ఈ సమావేశం లో జె ఇ శ్రీనివాస్,టెక్నికల్ అసిస్టెంట్ మారేగౌడ్, స్వాతి, అనిల్, నగేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## 75 రోజుల ఎఫ్ఎల్ఎన్ ప్రణాళిక సక్రమంగా అమలు చేయండి

### ఎంఇఓ శ్రీధర్..

**రొళ్ల (తెలుగోడు), జనవరి 21 :** మండలంలోని పిల్లిగుండ్లు గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల ను బుధవారం మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్ సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యలను పరిశీలన చేసి, ఎఫ్ ఎ 3 మూల్యాంకన పుస్తకాలు, విద్యార్థుల అటెండన్స్ రిజిస్టర్, ఉపాధ్యాయ అటెండన్స్ రిజిస్టర్, ఎండీఎం , చిక్కి, గుడ్లు, మార్కుల రిజిస్టర్ లను పరిశీలించారు. ముఖ్యంగా 75 రోజుల ఎఫ్ ఎల్ ఎన్ ప్రణాళికను సక్రమంగా అమలుచేయాలని సూచించారు. విద్యార్థుల కు మధ్యాహ్నం భోజనం రుచికరంగా ఉండాలని, మెనూ అమలు చేయాలని సూచనలు ఇచ్చారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఇఓ శ్రీధర్

## కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాతో పర్యవేక్షణ

### అగళి ఎస్సై శోభారాణి..

**అగళి (తెలుగోడు), జనవరి 21 :** జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు స్థానిక ఎస్సై శోభారాణి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది అగళి మండలానికి సమీపంలోని కర్ణాటక సరిహద్దులో గల గ్రామాలు, అగళి పట్టణ గ్రామాన్ని డ్రోన్ కెమెరాతో పర్యవేక్షించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్కా, జూదం, గొర్రెలు మేకల దొంగతనాలు, బహిరంగ మద్యపానం వంటి సామాజిక దుష్ట కార్యకలాపాలను అరికట్టడంపై డ్రోన్ కెమరాతో నిఘా నిర్వహించామన్నారు. ఇటువంటి దుష్ట కార్యకలాపాలను నివారించడానికి,ప్రజలకు మంచి పోలీసింగ్ అందించడానికి మరియు ప్రజలకుశాంతిభద్రతలను మరియు శాంతిని కాపాడటానికి ఇధి నిర్వహించాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శోభారాణి తో పాటు హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్ నాయక్, కానిస్టేబుల్ నాగరాజు, శివకుమార్,పాల్గొన్నారు



డ్రోన్‌లో కనిపించిన కర్ణాటక సరిహద్దు ప్రాంతం



డ్రోన్ కెమెరాతో పర్యవేక్షిస్తున్న ఎస్సై శోభారాణి, పోలీస్ సిబ్బంది

## సంస్కారవంతమైన విద్యార్థులే సుస్థిర భారతావనికి పునాది

### అదనపు జిల్లా న్యాయమూర్తి కంపల్లె శైలజ..

**హిందూపురం (తెలుగోడు), జనవరి 21 :** సంస్కారవంతమైన విద్యార్థులే సుస్థిర భారతావనికి పునాది అని, విద్యాసంస్థల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయినుల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని అదనపు జిల్లా న్యాయమూర్తి కంపల్లె శైలజ హెచ్చరించారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సదస్సుకు పాఠశాల అధ్యక్షులు, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ జోనల్ అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు, యువతే దేశానికి అసలైన సంపద అన్నారు. విద్యార్థి దశ నుంచే వారిని సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నగరాలకు మాత్రమే పరిమితమైన మత్తు పదార్థాలు నేడు గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించాయని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన విద్యార్థులు తప్పుదారి పట్టే ప్రమాదం ఉందని, వారిని చెడు వ్యసనాలకు బానిసలుగా మారకుండా మంచి మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడు తీసుకోవాలన్నారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలను సెల్?ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచేలా సూచనలు చేయాలని తెలిపారు. సమాజంలో చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాల నేపథ్యంలో పిల్లల బాధ్యతను అపరిచితులకు లేదా బాధ్యతారాహిత్యంగా ఉన్న వ్యక్తులకు అప్పగించకుండా జాగ్రత్త వహించాలన్నారు.



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న అదనపు జిల్లా న్యాయమూర్తి కంపల్లె శైలజ

చదువుతో పాటు రాజ్యాంగం కల్పించిన చట్టాలపై విద్యార్థులకు అవగాహన పెంచాలని సూచించారు. పాఠశాలల యాజమాన్యాలు ధనార్జనతో పాటు తమ సంస్థల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల నడవడికను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎక్కడైనా చిన్న తప్పిదం జరిగినా ఆ విద్యాసంస్థకు మాయని మచ్చగా మిగిలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఉపాధ్యాయులు, యాజమాన్యం సమన్వయంతో క్రమశిక్షణతో కూడిన విలువాధారిత విద్యను అందించి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని న్యాయమూర్తి కంపల్లె శైలజ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ప్రతినిధులు వేణుగోపాల్, రియాజ్, పాఠశాల హెచ్?ఎం గాయత్రి, న్యాయవాదులు సంతోషి కుమారి, నవేరా, రవిచంద్ర, మురళి, ఎస్?ఐ ఇసాక్?తో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్సీపీ అనుబంధ సంఘాల సమావేశం

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 21 :** బత్తలపల్లి మండలం అప్పరాచెరువు గ్రామంలో వైఎస్సార్సీపీ అనుబంధ సంఘాల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి అబ్జర్వర్ తంబాపురం సర్పంచు సానే జయచంద్రారెడ్డి అధ్యక్షత వహించారు.ఈ సమావేశంలో పార్టీ బత్తలపల్లి మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి మాట్లాడుతూ, పార్టీ కోసం అంకితభావంతో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను తప్పనిసరిగా గుర్తిస్తామని, వారికి పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. బడుగు, బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించిన ఏకైక పార్టీ వైఎస్సార్సీపీ అని పేర్కొన్నారు. కూటమి నాయకుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.ప్రజలకు చంద్రబాబు ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, స్థానిక ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు బండి వీరనారప్ప, మండల ఉపాధ్యక్షులు బ్యాల పెద్దయ్య, నాయకులు వెంకటరంగారెడ్డి, భాస్కరరెడ్డి, రాజవీరారెడ్డి, కొండారుపల్లి ఈశ్వరయ్య, కె. గంగిరెడ్డి, బాలగుర్రప్ప కోనారెడ్డి, రాంభూపాల్?రెడ్డి, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




అప్పరాచెరువులో పార్టీ అనుబంధ సంఘాల నాయకులతో సమావేశమైన పార్టీ నేతలు


## డొక్కలపల్లి ప్రాథమిక పాఠశాల ఆకస్మిక తనిఖీ

### ఎంఈఓ - 2 సిఎస్ నాయుడు..

**అగళి (తెలుగోడు), జనవరి 21 :** మండలం పరిధిలోని డొక్కలపల్లి ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఇఓ -2 చంద్రశేఖర్ నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగాపాఠశాలలోని పలు రికార్డులను పరిశీలన చేశారు. ప్రధానంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరు రిజిస్టర్లను పరిశీలించారు.



విద్యార్థుల చదువు పట్ల ఆరాతీస్తున్న ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు



ఉపాధ్యాయులతో చర్చిస్తున్న ఎంఈఓ -2 చంద్రశేఖర్ నాయుడు

ఉపాధ్యాయులకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు.ఉపాధ్యాయుల తో మాట్లాడుతూ విద్యార్థులకు గుణత్మాకమైన విద్యను అందించేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు వడ్డించాలని తెలియజేశారు.అనంతరం క్లాస్ రూమ్ లో కి వెళ్లి విద్యార్థులను ఆప్యాయంగా పలకరిస్తూ చదువు పట్ల ఆరా తీశారు.విద్యార్థుల అసెస్మెంట్ బుక్స్, క్వశ్చన్ పేపర్స్,ఎండిఎం రికార్డ్స్, ఆధార్ అప్డేట్స్, ఎఫ్ ఎల్ ఎన్ మెటీరియల్, పరిశీలనల చేస్తూ ఉపాధ్యాయులు హనుమంత రాయుడు ఎల్లారెడ్డి లతో చర్చించారు.



## ప్రయాణికుల నిర్లక్ష్యం.. ఆర్టీసీ సిబ్బందికి ప్రాణసంకటం..

### ప్రమాదంగా మారిన ప్రయాణం..

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 21 :** ప్రయాణికుల అవివేకం, నియంత్రణల లేమి ఇవన్నీ కలిసి ఆర్టీసీ సిబ్బందికి ప్రతిరోజూ ఒక పరీక్షగా మారుతున్నాయి. బుధవారం బత్తలపల్లి కూడలిలో చోటు చేసుకున్న ఘటన ఇందుకు నిదర్శనంగా నిలిచింది. ధర్మవరం నుంచి అనంతపురం వెళ్తున్న ఆర్టీసీ ఆర్డినరీ బస్సు బత్తలపల్లి కూడలిలో ఆగగానే, బస్సులో నుంచి దిగుతున్న ప్రయాణికులకు అవకాశం ఇవ్వకుండా కింద నుంచి ఎక్కేందుకు మరికొందరు ఎగబడ్డారు. కండక్టర్ పలుమార్లు లోపలికి వెళ్లాలని హెచ్చరించినా ఎవ్వరూ పట్టించుకోలేదు. బస్సు పూర్తిగా నిండిపోయింది. కాలు పెట్టేందుకు కూడా చోటు లేకపోయినా ప్రయాణికులు పోటీ పడుతూ ఎక్కారు. పరిస్థితి అదుపు తప్పడంతో డ్రైవర్ బస్సు నుంచి దిగివచ్చి తన మనోవేదనను వ్యక్తం చేశారు. డోరులో నిలబడి ప్రయాణం చేస్తూ అదుపుతప్పి కిందపడితే బాధ్యత ఎవరిది, మీ ప్రయాణం మాకు ప్రాణసంకటంలా మారింది అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ప్రయాణీకుల్లో క్రమశిక్షణ తగ్గిపోయిందని, ప్రమాదాలకు తావిచ్చే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పలువురు ప్రయాణీకులు కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులు కొనసాగితే ప్రమాదాలు తప్పవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సెమీఫైనల్‌లో తలబడుతున్న బత్తలపల్లి, ధర్మవరం జట్లు

## హోరాహోరీగా కబడ్డీ పోటీలు

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 21 :** బత్తలపల్లిలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో, కులమతాలకు అతీతంగా వారంరోజుల పాటు నిర్వహిస్తున్న ఇమామ్ ఖాశీం గంధం ఉత్సవాలలో భాగంగా బుధవారం కబడ్డీ పోటీలను నిర్వహించారు.హజరత్ ఏ హిమాం ఖాశీం ట్రస్ట్ ఛైర్మన్, నిర్వాహకులు మక్తుం ఖాళీంవలి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో మొత్తం ఏడు జట్లు పాల్గొన్నాయి. బత్తలపల్లి, ధర్మవరం, తాడిపత్రి, యాడికి, అనంతపురం వివేకానంద స్పోర్ట్స్, అనంతపురం ఆర్డీటి, కౌకుంట్ల జట్లు పరస్పరం తలపడ్డాయి.లీగ్ పద్ధతిలో నిర్వహించిన ఈ పోటీల్లో అన్ని జట్లు తీవ్రంగా పోటీపడటం తో మ్యాచ్?లు హోరాహోరీగా సాగాయి. చివరికి బత్తలపల్లి, కౌకుంట్ల జట్లు ఫైనల్?కు అర్హత సాధించాయి. ఈ రెండు జట్ల మధ్య గురువారం ఫైనల్ మ్యాచ్ జరగనుంది.ఈ పోటీలలో కోచ్?లు రామయ్య, పృథ్వీ, నరసింహులు, అనిల్?కుమార్, సంధ్యతో పాటు గ్రామ పెద్దలు జక్కంపూడి నాగభూషణ, నలజాల తిరుపాలు, మక్తుం ఇస్మాయిల్, మక్తుం మక్తుంసాబ్, మక్తుం ముబారక్, షేక్ బాబావలిలు పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు.

## గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణంతో చాలా ఉపయోగం

### సామాజిక తనిఖీ.. డిఆర్‌పి రాజేష్ ..

**రొళ్ల (తెలుగోడు), జనవరి 21 :** రోళ్ల పంచాయతీ పరిదిలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన సీసీ రోడ్లు నిర్మాణం ఎం బుక్ లో రికార్డుల ప్రకారం జరిగాయని ఆ రోడ్లు ఎంతో ఉపయోగ కరంగా ఉన్నాయని డిఆర్‌పి రాజేష్ వెల్లడించారు. స్థానిక గ్రామసచివాలయంలో బుధవారం ఉపాధి హామీ పనులపై నాలుగు రోజులపాటు నిర్వహించిన సామాజిక తనిఖీ గ్రామసభ ను నిర్వహించారు.రోళ్ల పంచాయతీలో ఉపాధి హామీ పనులలో జరిగిన వివరాలను సామాజిక తనిఖీ అధికారి డిఆర్పి రాజేష్ పరివేక్షణలో నాలుగు రోజుల పాటు గ్రామంలో తిరిగి కూలీల నుండి వివరాలు సేకరించిన వివరాలను చదివి వినిపించారు.జరిగిన పనుల వివరాలు ఉన్న లోపాల గ్రామ సభ దృష్టికి డి ఆర్ పి తీసుకొచ్చారు.ఈ ఆర్థిక సంవత్సరంలో 48 పనులకు గాను రూ.71 లక్షలు ఖర్చు చేసినట్లు డి ఆర్ పి వివరాలు వెల్లడించారు.హార్టికల్చర్ లో రైతులు నాటిన మొక్కల్లో తేడాలు ఉన్నాయని తెలుపగా చనిపోయిన మొక్కలు స్థానం లో కొత్త మొక్కలు నాటుతామని రైతులు అధికారులకు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్, ఎపిఓ ఓబుళప్ప, టెక్నికల్ అసిస్టెంట్ లు మారేగౌడ్, స్వాతి, మాజీ ఎంపీపీ నరసింహప్ప, సర్పంచ్ నరసింహప్ప, బూత్ ఇంచార్జ్ నాగరాజు, దేవరాజు, హనుమంత్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు నరసింహమూర్తి, మూర్తి, మెట్లు ఉపాధి కూలీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.




వివరాలు వెల్లడిస్తున్న డిఆర్‌పి రాజేష్

## 10 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ మహోత్సవం

### సీనియర్ నాయకుడు మంజు తారక్.. దిశా కమిటీ సభ్యులు, మాజీ ఎంపీపీ మీనాక్షి రామిరెడ్డి పంచాయతీ కో కన్వీనర్ నవీన్ కుమార్. పంచాయితీ కన్వీనర్ బిఎస్. నాగరాజు..









**అమరాపురం ( తెలుగోడు) జనవరి 21.** మండలంలో ఇళ్ల పట్టాల లబ్ధిదారులు ఈనెల 23న మడకశిర జూనియర్ కళాశాల ఆవరణ జరుగు ఇళ్ల పట్టాల పంపిణీ మహోత్సవానికి తరలి రావాలని తెలుగుదేశం సీనియర్ నాయకుడు, ఎన్. టి రామారావు, ఫ్యాన్స్ అధ్యక్షులు కో కన్వీనర్ మంజు తారక్., దిశా కమిటీ సభ్యులు, మాజీ ఎంపీపీ మీనాక్షి రామిరెడ్డి, వి. అగ్రహారం పంచాయతీ కో కన్వీనర్ నవీన్ కుమార్, వలస పంచాయతీ కన్వీనర్ బి.ఎస్. నాగరాజు వారు కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా 10 వేల మంది లబ్ధిదారులు ఇళ్ల పట్టాలకు మడకశిర ఎమ్మెల్యే ,టిటిడి బోర్డు సభ్యులు ,సత్యసాయి జిల్లా అధ్యక్షులు ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేద ప్రజల కష్టసుఖాలు తెలిసిన మనసున్న మారాజు చేతులు మీదుగా అందజేస్తారని వారు తెలిపారు. ఇళ్ల పట్టాలు మంజూరు అయిన లబ్ధిదారులు తరలి రావాలని వారు కోరారు.



అడ్మినిస్ట్రేషన్ అధికారిణి కౌసల్యకు వినతిపత్రం అందజేస్తున్న ఒకటో వార్డువాసులు

## ఒకటో వార్డులో మౌలిక సదుపాయాల కొరత

**కాలనీవాసుల తీవ్ర ఆవేదన..**

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 21 :**
పెద్దకడబూరు గ్రామంలోని స్థానిక ఒకటవ వార్డులో డ్రైనేజీ, తాగునీరు, రోడ్డు సదుపాయాలు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏవో కౌసల్యను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కాలనీలో ఎన్నో రోజులుగా మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని, పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు ఇళ్లలోకి చేరి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో ప్రత్యేక తాగునీటి బోరు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను కోరారు. పంచాయతీ అధికారులు కాలనీలో స్వయంగా పర్యటించి పరిస్థితిని పరిశీలించి, సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఒకటవ వార్డుకు చెందిన కాలనీవాసులు పాల్గొన్నారు.



డ్రాఫ్ట్ పట్టాదారు పాస్ పుస్తకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ సిరి

## డ్రాఫ్ట్ పట్టాదారు పాస్ పుస్తకాల పరిశీలన

**రైతుల ఆమోదం తర్వాతే తుది పాస్ పుస్తకాల ముద్రణ..**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి..**

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 21 :**
ఎమ్మిగనూరు మండలం కలగట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన డ్రాఫ్ట్ పట్టాదారు పాస్ పుస్తకాల శిబిరాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రాఫ్ట్ పట్టాదారు పాస్ పుస్తకాలు ఏ విధంగా తయారు చేస్తున్నారన్న విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు డ్రాఫ్ట్ పాస్ పుస్తకాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. పాస్ పుస్తకాల్లో రైతుల పేరు, భూమి విస్తీర్ణం, సర్వే నంబర్ తదితర వివరాల్లో ఎలాంటి పొరపాట్లు ఉన్నాయా లేదా రైతులు స్వయంగా పరిశీలించుకునేలా స్పష్టంగా వివరించాలని సిబ్బందిని ఆదేశించారు. రైతుల నుంచి పూర్తి ఆమోదం పొందిన తర్వాతనే తుది పట్టాదారు పాస్ పుస్తకాల ముద్రణ చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఒక రైతుకు డ్రాఫ్ట్ పట్టాదారు పాస్ పుస్తకం కాపీని జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్?తోపాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్ డాక్టర్ సిరికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

## పట్టణ కాలనీలో ముళ్ల కంపలు, చెట్లు తొలగింపు



**ఎమ్మిగనూరు (తెలుగోడు), జనవరి 21 :**
ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాలతో పట్టణంలోని ఎస్సీ కాలనీలో ముళ్ల కంపలు, చెట్లను టిడిపి నాయకులు వార్డ్ ఇంచార్జ నాయికంటి అంబేద్కర్, కోపరేటివ్ టౌన్ బ్యాంకు డైరెక్టర్ కదిరి కోట షాలేము తొలగించి శుభ్రం చేయించారు. దీనికి ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ గంగిరెడ్డి, కూటమి ప్రభుత్వానికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మద్రి బాలు, దానియేలు, జగతాపు జయరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కంపచెట్లు తొలగిస్తున్న టిడిపి నాయకులు

## కారు ఢీకొని రైతు దుర్మరణం

**మదనపల్లె (తెలుగోడు), జనవరి 21:**
అన్నమయ్య జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగి రైతు దుర్మరణం పాలయ్యాడు. తంబాలపల్లి నియోజకవర్గం లో బుధవారం జరిగిన విషాదకర ఘటనపై బాధితుడి కుటుంబీకుల కథనం.. ములకలచెరువు వడ్డిపల్లికి చెందిన చౌడప్ప కొడుకు రైతు శివశంకర్(42), తంబళ్లపల్లి మార్గంలోని అడవిచెరువు క్రాస్ వద్ద ఉండే వ్యవసాయ పొలంవద్దకు బైకులో వెళుతుండగా, కారు వేగంగావచ్చి ఢీకొట్టి వెళ్లిపోయింది. స్థానికులు108లో మదనపల్లికి తరలించగా అప్పటికే మృతి చెందాడు.

# ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**ఉగాది నాటికి 14,400**
**ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి..**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి..**

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 21 :**
జిల్లాలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి ఉగాది నాటికి 14,400 గృహాల నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆదోని మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆదోని డివిజన్ పరిధిలోని గృహ నిర్మాణాల పురోగతిపై జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చిరంజీవితో కలిసి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, నిర్మాణ ఏజెన్సీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన --1, 2 తోపాటు ఇప్పటికే ప్రారంభమైన అన్ని గృహ నిర్మాణాలను మార్చి నెలాఖరు నాటికి తప్పనిసరిగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా నిర్మాణ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుని పనులను వేగవంతం చేయాలన్నారు. లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారికి అవసరమైన ప్రోత్సాహం, అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం గృహ నిర్మాణాల కోసం ప్రతి దశకు సంబంధించిన నగదును నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తోందని, ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియపై ప్రజల నుండి సానుకూల స్పందన రావాలని



సమీక్షా సమావేశానికి హాజరైన అధికారులు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

ఆకాంక్షించారు. అలాగే, గృహ నిర్మాణాలకు అవసరమైన అదనపు ఆర్థిక సహాయం కోసం పొదుపు సంఘాల ద్వారా రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి ఇంటి నిర్మాణం ఏ దశలో ఉందో క్షేత్రస్థాయిలో పరిశీలించి, వేగవంతమైన పురోగతి సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గృహ నిర్మాణాల్లో నాణ్యతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, క్వాలిటీ తనిఖీలు నిర్వహించి మంచి ప్రమాణాలతో ఇళ్లను పూర్తిచేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్దేశిత గడువులోపు లక్ష్యాలను సాధించాలని సూచించారు.

జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాల పురోగతిపై రాష్ట్ర స్థాయిలో ప్రతిరోజూ సమీక్ష జరుగుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయిలో కూడా ప్రత్యేక దృష్టి సారించి ఎక్కడా ఆలస్యం లేకుండా పనులు ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిరంతర పరిశీలన చేపట్టి, పెండింగ్?లో ఉన్న ఇళ్లను గరిష్టంగా రెండు నెలల లోపు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఆదోని రూరల్, ఆదోని అర్బన్ పరిధిలో పెండింగ్?లో ఉన్న సుమారు 2,000 ఇళ్ల నిర్మాణాలను ప్రాధాన్యతగా పూర్తి చేయాలని తెలిపారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించడంతో పాటు, నిర్మాణ సామగ్రి సరఫరా, నిధుల విడుదల, సాంకేతిక సహకారం వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ చిరంజీవి, ఇంచార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఇంజనీర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, నిర్మాణ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యలకు డ్రైవ్ మోడ్ పరిష్కారం

**రీ సర్వే నాణ్యతలో లోటుపాట్లు ఉండొద్దు..**
**కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ..**

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 21 :**
జిల్లాలో 22- ఏ చుక్కల భూములు, ఇనాం నుంచి పట్టా, వెబ్?ల్యాండ్ కరెక్షన్లు వంటి పెండింగ్ రెవెన్యూ సమస్యలను డ్రైవ్ మోడ్‌లో వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదోని డివిజన్‌కు చెందిన రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రెవెన్యూ శాఖ పనితీరుపై ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరగాల్సిన అవసరం ఉందని, శాఖకు మంచి పేరు వచ్చేలా ప్రతి అధికారి బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా రెవెన్యూ క్లినిక్స్, స్పెషల్ క్యాంపులు, డివిజన్ వారీగా అధికారుల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు తక్షణ సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం రెవెన్యూ క్లినిక్స్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.
ఆదోని డివిజన్‌లో ఇనాం నుంచి పట్టా భూముల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని ప్రాధాన్యతగా డ్రైవ్ మోడ్‌లో పరిష్కరించాలన్నారు. అలాగే 22 ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల వల్ల రైతులు విద్య, వివాహ అవసరాల కోసం భూముల విక్రయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యలను సుమోటోగా పరిష్కరించాలని సూచించారు. వెబ్‌ల్యాండ్ కరెక్షన్లు, చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. భూ సమస్యలపై క్షేత్రస్థాయిలో తనిఖీలకు ముందు రైతులకు ముందస్తు నోటీసులు జారీ చేసి, వారి సమక్షంలోనే విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఇతరులు, అన్ క్లెయిమ్డ్ భూములపై ఈ నెల 24న గ్రామ సభలు నిర్వహించాలని, వాటి వివరాలను ముందుగానే రైతులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల



సమావేశానికి హాజరైన అధికారులు




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

అభిప్రాయాలను ప్రతిబింబించే ఐవీఆర్ పబ్లిక్ పర్‌సెప్షన్ సూచికలో రెవెన్యూ శాఖ పాజిటివ్ రేటింగ్ సాధించేలా అధికారులు పని చేయాలన్నారు. ప్రజలను తిప్పుకోకుండా సమస్యలు పరిష్కరించాలని స్పష్టం చేశారు. రెవెన్యూ శాఖ పనితీరుపై ముఖ్యమంత్రి స్థాయిలో సమీక్షా జరుగుతున్న నేపథ్యంలో ప్రతి అధికారి మరింత బాధ్యతతో విధులు నిర్వహించాలని చెప్పారు. ప్రతి మంగళవారం కలెక్టరేట్?లో రెవెన్యూ అంశాలపై సమీక్షా నిర్వహిస్తామని తెలిపారు. పట్టాదారు పాస్?పుస్తకాల పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరగాలని, రైతుల నుంచి ఈ--కేవైసీ తీసుకుని పాస్?బుక్ అందించాలని ఆదేశించారు. డబ్బులు అడిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫిబ్రవరి 2 నుంచి 9 వరకు పాస్ పుస్తకాల పంపిణీ వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. పాస్?బుక్‌లోని క్యూఆర్ కోడ్, వివరాలను రైతులకు స్పష్టంగా వివరించాలని తెలిపారు. రీ - సర్వే ప్రక్రియలో భాగంగా రైతుల నుంచి రెండు సార్లు ఈకేవైసీ తీసుకోవాలని, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు ఫీల్డ్?కు వెళ్లే ముందు తప్పనిసరిగా హాజరు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని వారిపై హాజరు ఆధారంగా జీతాల చెల్లింపులో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రీ - సర్వేలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా నాణ్యమైన పని చేయాలని స్పష్టం చేశారు. మార్చి 15 నాటికి అన్ని పెండింగ్ పిటిషన్లు పూర్తిగా పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ రైతు రైతుకు మధ్య ఉన్న భూ వివాదాలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని సూచించారు. ఇనాం నుంచి పట్టా సంబంధితంగా ఈరోజు 2,000 కేసులు పరిష్కరించే లక్ష్యం నిర్దేశించుకున్నామని తెలిపారు. 22-ఏ, డాటెడ్, ఇతరులు వంటి భూ సమస్యలపై ఆర్ఎస్ఆర్, అడంగల్ తదితర పత్రాలు పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో వెంకట నారాయణమ్మ, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, డివిజన్‌లోని అన్ని మండలాల తహసీల్దార్లు, డీటీలు, సర్వేయర్లు, కలెక్టరేట్ మరియు మండల స్థాయి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



బూత్ యూనిట్ ఇన్‌చార్జ్ తలారి అంజీని పరామర్శిస్తున్న టీడీపీ నేతలు

## అధైర్య పడొద్దు అండగా ఉంటాం

**టీడీపీ నేత నరవ..**

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 21 :**
పెద్దకడబూరు గ్రామానికి చెందిన టీడీపీ బూత్ మండల యూనిట్ ఇన్ చార్జ్ తలారి అంజీ అనారోగ్యంతో ఆదోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, సొసైటీ ఛైర్మన్ తలారి మీ సేవ ఆంజనేయులు బుధవారం బూత్ యూనిట్ ఇన్ చార్జ్ తలారి అంజీని పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని అండగా ఉంటామని టీడీపీ నేతలు భరోసా ఇచ్చారు. తలారి అంజీ త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

## 24 నుండి ఆలదపల్లిలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్

**అమరాపురం (తెలుగోడు), జనవరి 21 :**
మండల పరిధిలోని ఆలదపల్లి గ్రామంలో ఈనెల 24 నుండి 26వ తేదీ వరకు ఆలదపల్లి యూత్ క్రికెటర్స్-2026 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభంలో భాగంగా సీనియర్ ఆటగాళ్ల తరపున టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ను నిర్వహిస్తున్నట్లు క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు పి. ఆర్. నరసింహమూర్తి తెలిపారు. ఆలదపల్లి , కనకనపల్లి గ్రామ పెద్దలు, యువకుల నేతృత్వంలో మొదటి బహుమతి కనకనపల్లి తెలుగుదేశం సీనియర్ నాయకుడు, ఎన్. టి. రామారావు ఫ్యాన్స్ అధ్యక్షులు, కో కన్వీనర్ మంజుతారక్ 20 వేలు, ద్వితీయ బహుమతి ఈ. రఘునాథ్ 10 వేల రూపాయలు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు నిర్ణయించిన ప్రవేశ రుసుం చెల్లించి టోర్నమెంట్లో పాల్గొనాలని అన్నారు. పూర్తి వివరాల కోసం 9110746 839, 944 1472408 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.



కో కన్వీనర్ మంజుతారక్

## గంజాయి దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన

**అనంతపురం రూరల్ (తెలుగోడు), జనవరి 21 :**
అనంతపురంలోని అరవింద్ నగర్‌లో ఉన్న ఎస్‌కేడీ హైస్కూల్‌లో మాదక ద్రవ్యాలపై, ముఖ్యంగా గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై టూటౌన్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టూటౌన్ సి.ఐ శ్రీకాంత్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అవి ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా భవిష్యత్తును కూడా నాశనం చేస్తాయని వివరించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం వల్ల శారీరక, మానసిక సమస్యలతో పాటు చట్టపరమైన ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, చదువుపై దృష్టి సారించి మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. మాదక ద్రవ్యాల అక్రమ వినియోగం లేదా రవాణాపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



# వసంత పంచమి మహోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

**ముస్తాబైన కొలనుభారతి క్షేత్రం ..**
**భక్తుల సౌకర్యార్థం వివిధ ఏర్పాట్లు..**
**భక్తులకు ఉచిత దర్శనం..**
**భక్తులకు అన్నప్రసాదాల వితరణ..**
**పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ నిషేధం..**

**శ్రీశైలం (తెలుగోడు), జనవరి 21 :**
శ్రీశైలదేవస్థాన దత్తత దేవాలయమైన కొలనుభారతి క్షేత్రంలో ఈనెల 23వ తేదీన జరుగనున్న వసంత పంచమి మహోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లుగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, శ్రీశైలదేవస్థాన కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు తెలియజేశారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో మరియు శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు మరియు సభ్యుల సలహాల సూచనల అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈనెల 10వ తేదీన నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య ఆధ్వర్యములో డివిజన్ స్థాయి అధికారుల సమన్వయ సమావేశం జరిగిందన్నారు. ఈ సమావేశంలో పలువురు ప్రభుత్వశాఖల అధికారులతో పాటు పలువురు దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు కూడా పాల్గొనడం జరిగిందన్నారుసమన్వయ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆయా ఏర్పాట్లన్నింటిని పకడ్బందీగా చేస్తామన్నారు. గతంలో దర్శనానికి రూ. 5 రుసుముగా ఉండేదన్నారు. ఈ సంవత్సరం భక్తులందరికీ కూడా ఉచిత దర్శనాన్ని కల్పిస్తామన్నారు. ఉత్సవాల నిర్వహణకు దేవస్థానం సహాయకార్యనిర్వహణాధికారిని ప్రత్యేక అధికారిగా నియమించామన్నారు. అదేవిధంగా పలువురు దేవస్థానం అధికారులకు, సిబ్బందికి కూడా ఉత్సవాల ప్రత్యేక విధులను కేటాయించామన్నారు. ఉత్సవ నిర్వహణకు గాను ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి తహశీల్దార్లకు, డిప్యూటీ తహశీల్దార్లకు, ఇతర రెవెన్యూ సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారన్నారు. ఆత్మకూరు డి.ఎస్.పి వారి ఆధ్వర్యములో రద్దీక్రమబద్దీకరణ, వాహనాల క్రమబద్దీకరణ, భద్రతా చర్యలు చేపట్టామన్నారు. ఆర్.డబ్ల్యు.ఎస్. అధికారులు మంచినీటి సదుపాయ ఏర్పాట్లను పర్యవేక్షిస్తారన్నారు. కొత్తపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు వారి సిబ్బంది పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించడం జరుగుతుందన్నారుగోకవరం మండల ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి ఆధ్వర్యములో ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. దాత సహకారంతో దేవస్థానం భక్తులకు ఉచితంగా అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.



అన్నప్రసాద వితరణకు సంబంధించి దేవస్థానం దాతకు సంపూర్ణ సహాయ సహకారాలను అందిస్తోందన్నారు భక్తులు సౌకర్యవంతంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వీలుగా ప్రణాళికబద్దంగా క్యూలైన్లను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. భక్తులకు త్రాగునీరు అందించేందుకు కూడా ఆయా ఏర్పాట్లు చేయబడ్డాయన్నారు. వాహనాలరద్దీకనుగుణంగా పార్కింగ్ ఏర్పాట్లు చేయబడుతున్నాయన్నారు. పారిశుద్ధ్యం నిర్వహణకు కూడా తగు చర్యలు తీసుంటామన్నారు. ఎప్పటికప్పుడు చెత్తాచెదారాలను తొలగించేవిధంగా పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు.

వసంతపంచమి రోజున ఉదయం గం. 4.00లకు ఆలయద్వారాలు తెరచి ప్రాత:కాల పూజాధికాలు నిర్వహిస్తామన్నారు. వేకువజామున ఉదయం గం. 5.20 గంటలకు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. ఉదయం 6. నుంచి భక్తులకు దర్శనాలు, సామూహిక అక్షరాభాస్యాలు జరిపిస్తామన్నారు. మధ్యాహ్నం 11.15 గంటలకు అమ్మవారి మధ్యాహ్న కాలపూజలు జరిపిస్తామన్నారు. తరువాత దర్శనాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. సాయంకాలం 6.00 గంటలకు ప్రదోషకాలపూజలు, నివేదన, మహామంగళహారతులు నిర్వహిస్తామన్నారు. అనంతరం రాత్రి 7.00 గంటలకు ఆలయ ద్వారాలు మూసివేస్తారన్నారు.
పర్యావరణ పరిరక్షణలో భాగంగా కొలనుభారతిక్షేత్ర పరిసరాలలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించామన్నారు. కాబట్టి భక్తుల ఈ విషయంపై దేవస్థానానికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు



కొలనుభారతి క్షేత్రం ..



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సిఐ నాగేష్ బాబు

## చట్టాలపై మహిళలకు అవగాహన సదస్సు

**సిఐ నాగేష్ బాబు..**

**ముద్దనూరు (తెలుగోడు), జనవరి 21 :**
మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని సిఐ నాగేష్ బాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని యామవరం గ్రామంలో బుధవారం స్థానిక ప్రజలకు చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు చిన్నపిల్లలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అలాగే మీకు ఉన్న చట్టాలపై తెలుసుకొని తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. గ్రామంలో శాంతి భద్రతలకు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పరోక్షంగా కానీ ప్రత్యక్షంగా కానీ పాల్పడిన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ నాగేష్ బాబు పేర్కొన్నారు.

## పోలవరంలో ముగిసిన విదేశీ నిపుణుల బృందం పర్యటన

**పోలవరం, జనవరి 21:**
పోలవరం ప్రాజెక్టులో విదేశీ నిపుణుల బృందం మూడు రోజుల పర్యటన బుధవారంతో ముగిసింది. గురువారం ఈ నిపుణులు రాజమహేంద్రవరం లో పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ చీఫ్ ఇంజనీర్ ఎం. రమేష్ కుమార్ తో సమావేశం అవుతారు. శుక్రవారం అథారిటీ సి ఈ ఓ తో ఢిల్లీలో సమావేశం అవుతారు. విదేశీ నిపుణులు సీన్ హించిబెర్గెర్ , డేవిడ్ బి పాల్ , జియాన్ ఫ్రాంకో డి సీకో, కేంద్ర జలవనరుల శాఖ అధికారులు సరబ్జిత్ సింగ్ బక్షి , మనీష్ రాథోర్, గౌరవ్ తివారి, హేమంత్ గౌతమ్, సిఎసచవతీతీచంఆరచవతీతీచస్ అధికారులు మనీష్ గుప్తా , రవి అగర్వాల్ , , పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎం రఘురాం, డైరెక్టర్ కె శంకర్, చీఫ్ ఇంజనీర్ ఎం. రమేష్ కుమార్ ,ఎన్ ఐ ఆర్ ఎం డైరెక్టర్ అజయ్ కుమార్ నైతానిలతో కలిసి మూడు రోజుల్లో గ్యాప్ 1, డి హిల్, గ్యాప్ 2, జి హిల్, ప్రధాన డాం ఎగువ, దిగువ భాగాలు, డి వాల్ , డీ వాటరింగ్ ఛానల్, రాక్ ఫిల్, క్లే స్టాక్, మెయిన్ డాం గ్యాప్ 1 లో మట్టి పటిష్టత ఎలా ఉందొ తొమ్మిది గంటలపాటు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ తరువాత 12 గంటలపాటు సమీక్షించారు. తాము పరిశీలించిన అంశలపై తొలి రెండు రోజులు కేంద్ర జల సంఘం చీఫ్ ఇంజనీర్ భక్షి అధ్యక్షతన సమావేశమై చర్చించారు. మూడో రోజు జరిగిన సమావేశానికి పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ చీఫ్ ఇంజనీర్ ఎం. రమేష్ కుమార్ అధ్యక్షత వహించారు. మూడు రోజులపాటు జరిగిన క్షేత్రస్థాయి పరిశీలన, సమీక్ష సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాగునీటి సలహాదారు ఎం. వెంకటేశ్వర రావు, ఈ ఎన్ సి కే నరసింహమూర్తి, ఎస్ ఈ ఆర్ రామచంద్ర రావు, ప్రాజెక్ట్ నిర్మాణ సంస్థ ఎం ఈ ఐ ఎల్ జనరల్ మేనేజర్ ఏ గంగాధర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మురళి పమ్మి పాల్గొని విదేశీ నిపుణులు, కేంద్ర ప్రభుత్వ అధికారుల సందేహాలు నివృత్తి చేశారు. చివరి రోజు క్షేత్రస్థాయి పరిశీలనలో గ్యాప్ 1 లో తాము రెండో రోజు సూచించిన విధంగా గట్టి పరిచిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ తరువా ఆ మట్టిని తొలగించారు. మట్టి ఎలా గట్టి పడుతోంది, గట్టి పడిన తరువాత దాని స్థిరత్వం ఎలా ఉంది అనేది పరిశీలించారు. ఈ పరీక్ష అనంతరం ప్రాజెక్టులో నిర్మాణంలో ఉన్న వివిధ పనులను పరిశీలించారు. ఆ తరువాత మూడో రోజు తాము క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అంశాలతో పాటు అన్ని పనులపై సమీక్షించారు. పోలవరం ప్రాజెక్టులో మూడు రోజులపాటు పర్యటించిన విదేశీ నిపుణులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు, రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారు వెంకటేశ్వర రావు ను ఈ ఎన్ సి నరసింహమూర్తి జ్ఞాపికతో పాటు శాలువాతో సత్కరించారు.



## జెసి ప్రభాకర్ రెడ్డికి ఆహ్వానం

**తాడిపత్రి తెలుగోడు), జనవరి 21 :**
తాడిపత్రి పట్టణంలోని ఐశ్వర్య విల్లాస్ వద్ద కడప రోడ్డులో శ్రీ వాసవి మాత విగ్రహావిష్కరణను పురస్కరించుకొని మునిసిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డిని పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు కలిసి ఆహ్వానం అందించారు.



నూతన బోరుకు మోటారు పైపులు అ మరుస్తున్న స్థానిక నేతలు

## తాగునీటి సమస్యకు పరిష్కారం

**రామకుప్పం (తెలుగోడు), జనవరి 21 :**
మండలంలోని కెంచనబల్ల పంచాయతీ రెడ్డివాని పోడు గ్రామంలో త్రాగునీటి సమస్య గత 40 సంవత్సరాల నుంచి ఉండగా స్థానిక నేతలు చొరవతో పరిష్కారం చూపారు. హంద్రీ-నీవా జలాలు తోట్ల చెరువుకు పుష్కలంగా చేరడంతో వారం క్రితం నూతన బోరు వేయించారు. బుధవారం స్థానిక నేతలు రెడ్డివాని పోడు గ్రామంలో నూతన మోటరు, పైపులు అమర్చి త్రాగునీరు అందించారు. దీంతో గ్రామస్తులు స్థానిక నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేత నారాయణ చారి, పంచాయతీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, వేలు, గుణశేఖర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పశు ఆరోగ్య శిబిరాలతోనే పాడి సంపద రక్షణ

**డాక్టర్ రవీంద్రారెడ్డి..**

**దువ్వూరు (తెలుగోడు), జనవరి 21 :**
మండలంలోని పాడి రైతులు ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని తమ పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కానగూడూరు పశువైద్యాధికారి డాక్టర్ రవీంద్రారెడ్డి సూచించారు. బుధవారం దువ్వూరు మండల పరిధిలోని మూడింద్లపల్లె గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మంచాల రాజగోపాల్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. డాక్టర్ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో పశువులకు మరియు జీవాలకు విస్తృతంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భకోశ చికిత్స, 5 పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించి ప్రత్యేక చికిత్స అందించారు. నట్టల నివారణ, 31 దూడలకు, అలాగే 307 గొర్రెలు మరియు మేకలకు నట్టల నివారణ మందులను వేశారు. మరో 75 పశువులకు వివిధ ఆరోగ్య సమస్యలపై పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య చికిత్సలతో పాటు పాడి రైతులకు లాభదాయకమైన అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పశు బీమా ప్రాముఖ్యతను వివరించడంతో పాటు, మేలుజాతి పశువుల అభివృద్ధికి దోహదపడే లింగ నిర్ధారణ వీర్యం గురించి



పశువులకు మందులు వేస్తున్న సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి , పశువైద్యాధికారులు

అవగాహన కల్పించారు. పశువుల పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వియల్ ఓ భగీరథి, వి ఏలు లక్ష్మీకాంత్, ఆరిఫ్, మహిత, సుప్రజ, హరి, జీవ మిత్రలతో పాటు గ్రామ పాడి రైతులు, జీవాల సంరక్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాయిఖానాతో పొంచిఉన్న ప్రమాదం!

**పెచ్చులూడి పడుతున్న పాయిఖానా పైకప్పు.. ప్రమాదం అంచున ప్రజలు.**

**ముద్దనూరు (తెలుగోడు), జనవరి 21 :**
స్థానిక మేజర్ పంచాయతీలో ఉన్న బస్టాండ్‌లోని పబ్లిక్ పాయిఖానా పైపెచ్చులు ఊడి పడుతోంది. అలాగే కొంత మేర పైభాగాన రేకులు తుప్పు పట్టి అస్తవ్యస్తంగా మారింది. దీంతో పాయిఖానాను వినియోగించుకోవడానికి వచ్చే ప్రయాణికులు, భయభ్రాంతులకు లోనఅవుతున్నారు. పెచ్చులూడి పడిపోవడంతో ప్రమాదం అంచుకు చేరుకుంటున్నారు. బుధవారం ఓ ప్రయాణికురాలు వ్యక్తిగత అవసరాలు తీర్చుకునేందుకు పబ్లిక్ లెట్రిన్‌కు వెళ్లి బయటకు రాగానే లెట్రిన్ రూమ్ పైభాగంలో ఉన్న కాంక్రీట్ స్లాబ్ పైభాగం పెచ్చులు ఊడి పడడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఆ మహిళ కొద్దిసేపు అక్కడే ఉండుంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని తెలిపారు. నిత్యం జనంతో రీద్దీగా ఉండే బస్టాండ్‌లో వివిధ ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణికులు పొరపాటున వెళితే పైకప్పు నుండి ఊడిపడే కాంక్రీట్ పెచ్చులతో పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. వెంటనే అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రత్యామ్నాయం చూడాలని ప్రయాణికులు ప్రజలు



పబ్లిక్ బాత్రూంలో పెచ్చులూడి పడుతున్న సిమెంట్ స్లాబ్ బాత్రూం పైభాగంలో తుప్పుపట్టిన రేకులు

కోరుకుంటున్నారు. ఈ సమస్యను పంచాయతీ ఈవో నరసింహులు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే సమస్యకు ప్రత్యామ్నాయం చేస్తామని తెలిపారు.

# రసాయనిక వ్యవసాయం వద్దు సహజ సిద్ధ వ్యవసాయమే ముద్దు

**వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకటకృష్ణారెడ్డి ..**

**ముద్దనూరు (తెలుగోడు), జనవరి 21 :**
మండల పరిధిలోని చెన్నారెడ్డి పల్లె, బందలకుంట, గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. వ్యవసాయ అధికారి మారేడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రతి రైతు సహజ సిద్ధ పద్ధతులను అనుసరించి పకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలి అని అన్నారు. అనంతరం గ్రామంలో రబిలో సాగుచేసిన అన్ని పంటలను పరిశీలించి పంట నమోదు చేయించుకోవాలన్నారు. పిఎం కిసాన్ పథకం లబ్ధి పొందే ప్రతి రైతు విశిష్ట సంఖ్య గుర్తింపు కొరకు తమ పేరును ఏపీ ఎఫ్ ఆర్ పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ప్రతి రైతు ఏపీ ఎయిమ్స్ యాప్ ను డౌన్లోడ్ చేసుకొని రైతుల పంట నమోదు బయోడేటా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా ప్రభుత్వం ద్వారా వ్యవసాయ శాఖ అమలు చేసే పలు పథకాల సమాచారం తెలుస్తుంది అని తెలిపారు. అనంతరం బొందలకుంట



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకటకృష్ణారెడ్డి , సిబ్బంది

గ్రామంలో బత్తాయి పంట లో,అంతర పంటగా సాగు చేసిన శనగ పంటను పరిశీలించి చీడ నివారణ పై రైతుకు తగు సలహాలు, ఇచ్చారు.పూత దశలో ఉన్న శనగ పంటను పరిశీలించి రైతులకుసూచనలు ఇచ్చారు. అలాగే యూరియాను అధికారులు తెలిపిన సమాచారం మేరితే రైతులు వినియోగించాలన్నారు. ప్రతి రైతు పకృతి వ్యవసాయం వైపు దృష్టిసారించి తమకున్న పొలంలో , కొంత విస్తీర్ణంలో సహాజసిద్ధ పద్ధతులు అనుసరించి పంటలు సాగు చేసి భావితరాల మనుగడకు తోడ్పడాలని ఆయన పేర్కొన్నారు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతులను పాటించి పంటలు సాగు చేసుకుంటే రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పకృతి వ్యవసాయ సిబ్బంది నూజహత్, ముని భూపాలుడు, రాధిక, శ్రీదేవి, శైలజ, వెంకట సుబ్బమ్మ, అనసూయ మరియు గ్రామ రైతులు వెంకటాద్రి, ఏ నారాయణ తదితరులు పాల్గొన్నారు




పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకటకృష్ణారెడ్డి , సిబ్బంది

# సంగం పొలాల్లో అక్రమ నిర్మాణాలు

**నిబంధనకు నీళ్లు .. పట్టించుకోని రెవెన్యూ అధికారులు.**

**సంగం తెలుగోడు), జనవరి 21 :**
సంగం చెక్ పోస్ట్ సమీపంలోని ఎన్. హెచ్. రోడ్డు నిర్మాణం పక్కన సర్వే నంబర్ 249లో వ్యాపారులు పొలాన్ని కన్వర్షన్ చేయకుండా నివాస నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. కళ్ల ముందు చేస్తున్న అక్రమ నిర్మాణాలు రెవెన్యూ అధికారికి కనిపించలేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పొలానికి సంబంధించి ఎటువంటి అనుమతులు లేకుంటే ఇష్టం వచ్చినట్టు కట్టడాలు కడుతున్నా స్థానిక రెవెన్యూ అధికారి మాత్రం పట్టించుకోలేదని విమర్శలు ఉన్నాయి.

ఇక్కడ గతంలో లేఔట్ నిర్మాణం కొనసాగింది. నలుగురు వ్యాపారస్తులు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆ సమయంలో కొనేందుకు ఎవరూ ముందుకు రాక కొనుగోలు చేసిన ప్లాట్లు దారి లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇలాంటి సమయంలో ఇతర మండలాలకు చెందిన ఓ



పొలంలో నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం



పొలంలో నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం

వ్యక్తి తాను ఇక్కడ వ్యాపారాలు సాగిస్తానని నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ఎవరు ఎటువంటి నిర్మాణాలకు ఆధారాలు మాత్రం ఇవ్వలేదు అని స్థానికులు తెలుపుతున్నారు. మరోపక్క ఎన్ హెచ్ సంబంధించి కల్వర్టు ఉంది. దాని పక్కనే వంటకాలవ సాగుకు వెళ్లాల్సి ఉండగా దాన్ని పైప్ లైన్ నిర్మాణం చేయకుండానే పూడ్చి రోడ్డు ఏర్పాటు చేసుకోవడం ఎంతవరకు న్యాయమని ఆయకట్టు రైతులు అంటున్నారు. గ్రావెల్ కోసం విజిలెన్స్ అధికారులు ప్రైవేటు సంస్థకు అప్పగించడంతో అడ్డుకోవడంతో ఆ సమయంలో బిల్లులు చూపించి తోలుకున్నారు. బుచ్చిరెడ్డిపాలెం లేఅవుట్‌కు తరలిస్తుండగా ఆ బిలులను సంగంలో చూపించి తరలించారన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. ఎక్కడి నుంచి తోలేనా అధికారులుపర్యవేక్షణ ఉందే ఇబ్బంది లేదని స్థానికులు తెలుపుతున్నారు. ఎలాంటి కట్టడాలు చేపట్టకుండా రెవెన్యూ అధికారి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి పొలాల్లో చేపడుతున్న నిర్మాణాలను అడ్డుకోవాలని కోరుతున్నారు. లేకుంటే గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామని అంటున్నారు.




పనులను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

## రూ. 6 లక్షలతో పబ్లిక్ టాయిలెట్ల పనులు ప్రారంభం

**దువ్వూరు (తెలుగోడు), జనవరి 21 :**
దువ్వూరు మండల కేంద్రంలో గత రెండు దశాబ్దాలుగా నెలకొన్న ప్రధాన సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. పట్టణంలో ఆర్డబ్ల్యూఎస్ నిధులతో సుమారు 6 లక్షల రూపాయల అంచనా వ్యయంతో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణ పనులు బుధవారం శరవేగంగా ప్రారంభమయ్యాయి. దువ్వూరు మండల కేంద్రానికి ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. అయితే, గత 20 ఏళ్లుగా ఇక్కడ సరైన పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతో ప్రజలు, ముఖ్యంగా మహిళలు మరియు ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజల కష్టాలను గుర్తించిన ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, తక్షణమే నిధులు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన చొరవతో 6 లక్షల రూపాయల నిధులు మంజూరు కావడంతో, గత నెలలో శంకుస్థాపన చేశారు. దశాబ్దాల నాటి తమ సమస్య పరిష్కారం కావడంపై మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పనులు వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు పాపినేని రాంబాబు, శెట్టి నాగరాజు యాదవ్, తరి బోయిన రమేష్ యాదవ్, గడ్డం గురు ప్రసాద్, హర్షద్, కాంట్రాక్టర్ పుల్లగూర నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.




రైతులకు సూచనలు సలహాలు తెలియజేస్తున్న ఏ డి ఏ కృష్ణమూర్తి

## దువ్వూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం

**ఏడీఏ కృష్ణమూర్తి..**

**దువ్వూరు (తెలుగోడు), జనవరి 21 :**
దువ్వూరు మండల కేంద్రంలో బుధవారం రబీ పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది . ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడిఏ) శ్రీ కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని, క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ,మండలంలో సాగు చేసిన పసుపు, మొక్కజొన్న పంటల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆయా పంటల్లో ఆశించే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ మరియు పీఎం కిసాన్ పథకాల గురించి ఆయన చర్చించారు. అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వ ఫలాలు అందాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు పొందాలంటే ప్రతి రైతుకు రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని ఏడీఏ స్పష్టం చేశారు. రైతులందరూ తమ పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డు మరియు సెల్ నెంబర్ తీసుకొని వెంటనే స్థానిక రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని సూచించారు. రబీ పంట నమోదు ప్రక్రియ సాగుతోందని, క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి పంటను నమోదు చేస్తారని తెలిపారు. మినుము, మొక్కజొన్న, సజ్జలు, జొన్న తదితర పంటలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి. పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పంట నష్టపరిహారం క్రాప్ ఇన్సూరెన్స్, కనీస మద్దతు ధర మరియు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు,రాంచరణ్, కాంతమ్మ, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకట మోహన్

## మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన

**ఎస్ఐ వెంకట మోహన్ ..**

**రామకుప్పం (తెలుగోడు), జనవరి 21 :**
మండలంలోని ప్రజలకు మత్తు పదార్థాలపై ఎస్ఐ వెంకట మోహన్ అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని గుట్టురు తాండాలో గంజాయి, మత్తు పదార్థాలు పై వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా గంజాయికి బానిసైన యువతను తల్లిదండ్రులు ఇతరులు జీవిస్తున్న సమాజం పట్ల అవగాహన కల్పించాలన్నారు. మత్తు పదార్థాలు ఎవరైనా విగ్రహిస్తే తమకు తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ,స్థానికులు పాల్గొన్నారు.



సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళి

## పంటల సాగుపై రైతులకు అవగాహన

**రామకుప్పం (తెలుగోడు), జనవరి 21 :**
రైతులు సాగు చేస్తున్న పంటలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చల్దిగానిపల్లి గ్రామ రైతులతో పంటల సాగుపై సమీక్షించారు. సులభమైన డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో తక్కువ నీటితో ఎక్కువ సాగు చేసుకోవచ్చున్నారు. పంట దిగుబడి మార్కెట్ విక్రయాలపై పలు సూచనలు అందజేశారు. రైతు సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వం ద్వారా అందుతున్న బ్యాంకు రుణాలు, సబ్సిడీలు తదితరు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారులు రైతులు పాల్గొన్నారు.

# సీమ ప్రజలు రేవంత్ రెడ్డికి బానిసలుగా ఉండాలా..

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏమి జరుగుతున్నది. ఈ రాష్ట్రాలను ఏమి చేయాలని ఉన్నారు. రెండు రాష్ట్రాలు రెండు కళ్ళు అంటూనే రెండు రాష్ట్రాల మధ్య మంటలు రగిలిస్తున్నారు.
రాయలసీమ ప్రాంతానికి నీటి హక్కులు లేవా.
రాయలసీమ ప్రాంత ప్రజలు రేవంత్ రెడ్డికి బానిసలుగా బతకాలా.
తెలంగాణ ప్రజలు బాబు గారికి నీ కాళ్ళు మొక్కుతా బాంచన్ దొరా అనాలా అని ఆంధ్ర ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



మన పాలకులు తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెడతారే కానీ,రాయలసీమ ప్రాంతంలో ఉన్న తుంగభద్ర, కృష్ణానదులపై జాతీయ ప్రాజెక్టులను సాదించే ధమ్ము లేదు.
మనకు దక్కాల్సిన నీళ్లను సముద్రానికి,తెలంగాణకు జారవిడిచే.బాబు విచిత్ర ప్రవర్తన గురించి మేధావులు,ఉద్యమకారులు గళమెత్తాలి.
రాయలసీమలో కొత్త ప్రాజెక్టులను నిర్మించడం అటు ఉంచితే, పెండింగ్‌లో ఉన్న వాటిని కూడా 30 సంవత్సరములుగా పూర్తి చేయకుండా నీళ్లను సముద్రం పాలు చేస్తున్న వీరిని వెనకేసుకుని వచ్చే మీడియాను ఏమనాలి. ఎందుకంటే తమ రోత రాతలతో జనాలను నమ్మించి, జనాల ఆస్తులను పాలకులతో రాయించుకుంటున్న, రాజకీయ వ్యభిచార మీడియా బ్రోకర్లు కాబట్టి.
దేశంలోనే ఎక్కువ నీటిని సముద్రం పాలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదే, దేశంలోనే అతి తక్కువ వర్షపాతం నమోదవుతున్న రెండవ ప్రాంతం రాయలసీమ. దేశంలోనే ఎక్కువ పూడిక ఏర్పడి ప్రమాద గంటి కలలు మోగిస్తున్నది తుంగభద్ర, శ్రీశైలం డ్యామ్‌లూ ఇక్కడే ఉన్నాయి. దేశంలోనే పంట కాలువలు ఏర్పాటు చేయకుండానే బంగారు పంటలు పండించి సస్యశ్యామలం చేస్తామని నిత్యం అబద్ధం చెప్పే ముఖ్యమంత్రి ఇక్కడే.
దేశంలోనే నిర్బంధ అభివృద్ధికేంద్రీకరణ వల్లనే విభజన జరిగిందని వల్లె వేసిన బాబు,విభజన తరువాత మరోసారి అమరావతి పేరుతో నిర్బంధ అభివృద్ధి కేంద్రీకరణ చేస్తూ రాయలసీమ ప్రాంతానికి తీరని ద్రోహం చేస్తున్నారు. సీమ ప్రజలను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే చూస్తున్నారు.ఇది రాజకీయ శాడిజం గాక మరి ఏమిటి.
నిజాలు రాయని మీడియా బ్రోకర్లు, సీమ బిడ్డల సొత్తు అయిన ప్రభుత్వ భూములను ఎలా తీసుకుంటుంది. ఈ ప్రభుత్వం ఎలా ఇస్తుంది.
ఇలాంటి బ్రోకర్ మీడియా.కు,ప్రజలను వంచించిన ప్రభుత్వానికి సీమ ప్రజలు కీలెరిగి వాత పెట్టాలి.

**– కెవి రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు,**
**వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక, అనంతపురం.**



ఈనారీల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

## ఈనారీలకు శిక్షణ కార్యక్రమం

**తనకల్లు (తెలుగోడు), జనవరి 21:**
తనకల్లు మండలంలోని చౌడేశ్వరి మండల సమాఖ్య కార్యాలయంలో మొదటి రోజు ఈనారీలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ నారీల వ్యూహం, ఈనారీల అర్హతలు, మన డబ్బులు, మన లెక్కలు, సంస్థాగత నిర్మాణం, బ్యాంకు ఋణాలు, ఉన్నతి/స్త్రీ నిధి ఋణలు, పౌష్టికాహారం, జెండర్ గురించి, జీవనోపాదుల తదితర విషయాలు, ప్రభుత్వ పథకాల అమలుచేయడంపై సభ్యులకు అవగాహన కల్పించారు. విఓఏలతో కలిసి టీమ్ వర్క్ చేయాలని సూచించారు. ఈనారిలు సంఘం సభ్యులకు అందుబాటులో ఉండాలని, మన డబ్బులు మన లెక్కల గురించి తెలియజేశారు. ఈ సమావేశంలో ఏపీఎం జయంతి , సీసీలు, ప్రవీణ్, నాగార్జున, చంద్రారెడ్డి , జహారాబి, బాబ్జాన్, ఓబీలు, అకౌంటెంట్లు, ఈనారీలు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఈనారీలు

## మదనపల్లె ఆర్టీసీ బస్టాండులో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**మదనపల్లె (తెలుగోడు), జనవరి 21:**
అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి ఆర్టీసీ బస్టాండ్ లో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు టూ టౌన్ ఎసచవతీతీచ రహీముల్లా తెలిపారు. ఆర్టీసీ గేటు సమీపంలో సుమారు 40 ఏళ్ళ వయసున్న వ్యక్తి చనిపోయి ఉండడాన్ని స్థానికంగా ఉన్న ఆటో డ్రైవర్లు గుర్తించి సమాచారం అందించగా, వెంటనే వెళ్లి మృతదేహాన్ని పరిశీలించా మన్నారు. అనంతరం మృత దేహానికి పంచనామా నిర్వహించి, సీఐ ఆదేశాలతో ఏ ఎస్ ఐ రమణ సిబ్బంది డెడ్ బాడీ ని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించామని తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు వెంటనే మదనపల్లి రెండవ పట్టణ పోలీసులను ఆశ్రయించాలని ఎస్సై కోరారు... 9440796741 కు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

# విద్యుత్ ప్రాజెక్టు పనులపై దృష్టి సారించాలి

### జిల్లాకు 30 మెగావాట్ల సోలార్ విద్యుత్ కేటాయించండి.. అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ..

**మదనపల్లె (తెలుగోడు), జనవరి 21:**
ఏపీఎస్పీడిసిఎల్, నెడ్ క్యాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యుత్ ప్రాజెక్టు పనులకు సంబంధించిన అన్నిరకాల పెండింగ్ ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబందిత అధికారులను ఆదేశించారు. బుధవారం తిరుపతిలోని ఏపీఎస్పీడిసిఎల్ సీఎండి ఛాంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి, విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఎపిఎస్పిడీసీఎల్ సీఎండి శివశంకర్‌తో కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి విద్యుత్, సోలార్ పవర్ ప్రాజెక్టుల నిర్మాణ పురోగతిపై ఏపీఎస్పీడిసిఎల్ సర్కిల్ పరిధిలోని ప్రాంతీయ జిల్లాల కలెక్టర్లు, సంబంధిత ఎస్ఈలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ నిశాంత్



అధికారులతో మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

కుమార్ మదనపల్లె కలెక్టరేట్ నుండి హాజరయ్యారు. జిల్లాలో సోలార్ పవర్ ప్రాజెక్టు పనులపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి వివరించారు. మదనపల్లి కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఏర్పాటు అనంతరం గతంలో అన్నమయ్య జిల్లాకు కేటాయించబడిన 19 మెగావాట్ల విద్యుత్ ప్రస్తుతం కడప జిల్లాకు మార్చబడినందున మదనపల్లి కేంద్రంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాకు కనీసం 30 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యాన్ని కేటాయించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించి భూమిని గుర్తించి నివేదికలు పంపాలని సూచించారు.
సీఎస్ విసి ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడారు. పీఎం కుసుం పురోగతి, పీఎం-సూర్య ఘర్ పురోగతి, తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఆదేశాలు, సూచనల మేరకు.. 2026 డిసెంబర్ నాటికి పిఎం కుసుమ్ పథకం ద్వారా అభివృద్ధి చేస్తున్న ఫీడర్ లెవెల్ సోలరైజేషన్‌కు సంబంధించి భూసేకరణ ప్రక్రియ, ఫీడర్ల ఏర్పాటు తదితర పనులను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.
ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఏపీఎస్పీడిసిఎల్ అధికారి సోమశేఖర్, మదనపల్లె ఈఈ గంగాధర్, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లీజుకు నిరుపయోగంగా ఉన్న కోల్డ్ స్టోరేజ్

### 15 కిలోల క్రేట్లతో ఆక్షన్ రైతులకు లాభదాయకం .. టమోటా మార్కెట్ ఆధ్వర్యంలో తక్కువ ధరలతో క్యాంటిన్ ఏర్పాటు .. మదనపల్లె టమోటా మార్కెట్ రైతులతో చైర్మన్ శివరామ్ ముఖాముఖి..

**మదనపల్లె (తెలుగోడు), జనవరి 21:**
టమోటా రైతాంగానికి అన్నివిధాలా అండగా నిలవడానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎల్లప్పుడూ సిద్దంగా వుంటుందని ఏఎంసీ చైర్మన్ జంగాల శివరామ్ తెలిపారు. మదనపల్లె టమోటా మార్కెట్లో ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ ఆంజనేయులు సంయుక్త ఆధ్వర్యంలో డైరెక్టర్లు మండిల వద్ద రైతులతో ముఖాముఖి నిర్వహించి రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులకు లాభం చేకూర్చే దిశగా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ పని చేస్తుందని స్పష్టం చేస్తూ పలు అంశలపై చర్చించి వారి అభిప్రాయాలు తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ జంగాల శివరామ్ మీడియాతో మాట్లాడుతూ ముఖ్యంగా టమోటా రైతాంగానికి మేలు చేకురే విధంగా 15 కిలోల క్రేట్లు వినియోగంపై అవగాహన కల్పించామని తెలిపారు. మార్కెట్లోని మండి యజమానులు అందరూ ప్రస్తుతం వినియోగిస్తున్న 30 కిలోల క్రేట్లు తొలగించి 15 కిలోల క్రేట్లు వాడాలన్నారు. మార్కెట్లో రైతులు, కార్మికుల కోసం నూతనంగా మరో



మదనపల్లె టమోటా మార్కెట్ రైతులతో చైర్మన్ శివరామ్

ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. అదేవిధంగా మదనపల్లె టమోటా మార్కెట్లో అదనంగా మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. మార్కెట్ కమిటీ ద్వారానే నిర్మించి, ఇతరులకు నిర్వహణ భాద్యతలు అప్పగించడం లేదా పిపిపి విధానంలో ఏర్పాటు చేయాలా అనే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మార్కెట్ ఆధ్వర్యంలో రైతులు, టమోటా మార్కెట్ కార్మికుల కోసం తక్కువ ధలకే ఆహారం అందించే విధంగా క్యాంటిన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు .మార్కెట్ క్యాంటిన్ ఏర్పాటు చెస్తే మరింత మందికి తక్కువ ధరలకే ఆహారం అందించవచ్చు అని వివరించారు. మార్కెట్లో ఎసి గోడౌన్ నిరుపయోగంగా ఉందని, దానిని అరటి, ఆపిల్, దానిమ్మ, ఇతర సరుకు నిల్వలు చేసే మండిల వారికి లీజుకు ఇస్తామన్నారు.. ఈ సమావేశంలో ఎఎంసి డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

# ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో అప్రోచ్ రోడ్డుకు అడ్డంగా తవ్వకాలు

### పరిహారం రాలేదని అడ్డుకొన్న బాధితుడు.. కలెక్టరేట్ ఎదుట ఎంఎస్ఎంఈ బాధితుల నిరసన

**మదనపల్లె (తెలుగోడు), జనవరి 21:**
మదనపల్లె మండలం వలసపల్లి పంచాయతీలో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో రోడ్డుకు అడ్డంగా మోహన్ జెసీబీతో తవ్వేశాడు. పరిశ్రమలకు కేటాయించిన స్థలంలో జరుగుతున్న పనులను సైతం అడ్డుకొంటున్నారని తమకు న్యాయం చేయాలని ఎంఎస్ఎంఈ బాధితులు మదనపల్లె జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువత వ్యాపార వేత్తలుగా ప్రోత్సహిస్తూ మదనపల్లె మండలం వలసపల్లి పంచాయతీ సమీపంలోని ఇండస్ట్రియల్ ప్రాంతంలో 68 మందికి స్థలాలు కేటాయించారన్నారు. అందులో 20కి పైగా పరిశ్రమలు పూర్తిస్థాయిలో నడుస్తుండగా, మిగిలిన స్థలాలలో



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎంఎస్ఎంఈ బాధితులు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎంఎస్ఎంఈ బాధితులు

పరిశ్రమలు ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయని వివరించారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోకి వెళ్లేందుకు ప్రధాన రహదారి నుంచి ఉన్న అప్రోచ్ రోడ్డును అడ్డంగా మోహన్ జేసీబీతో తవ్వేశాడు. అంతేకాకుండా తమ భూమిలో ఎ లాంటి కట్టడాలు చేపట్టరాదని ఎంఎస్ఎంఈ నిర్వాహకులను అడ్డుకున్నారు. 15 సంవత్సరాల కితం మా భూములు తీసుకొని పరిహారం చెల్లించక పోవడంతో మోహన్ పరిశ్రమల నిర్మాణాలను అడ్డుకుంటున్నారని వివరించారు.
జిల్లా అధికారులు స్పందించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో నిరసనలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ నిశాంత కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ ప్రభావితులు యుగంధర్ వెంకటరెడ్డి రామిరెడ్డి చెన్నం చలపతి, ప్యారూఖాన్, మధుబాబు, చిన్నరెడ్డెప్ప, చలపతి, ఆనంద్, సయ్యద్ అహమ్మద్, ధనరాజ్, మద్దయ్య, భరత్ తదితరులు ఉన్నారు.



అన్నమయ్య మదనపల్లె జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బుధవారం బాధ్యతలు చేపడుతున్న శివనారాయణ శర్మ

## జెసిగా బాధ్యతలు చేపట్టిన శివ నారాయణ శర్మ

**మదనపల్లె (తెలుగోడు), జనవరి 21:**
అన్నమయ్య జిల్లా నూతన సంయుక్త కలెక్టర్‌గా శివ నారాయణ శర్మ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ముందుగా నూతన సంయుక్త కలెక్టర్ అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్?ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా సంయుక్త కలెక్టర్ తో పలు విషయాలు చర్చించారు. అనంతరం వేద పండితులు వేదమంత్రాలతో ఛాంబర్‌లోకి ఆహ్వానం పలకగా నూతన సంయుక్త కలెక్టర్‌గా శివనారాయణ శర్మ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని, అధికారుల సమన్వయం చేసుకుంటూ వారి సహకారంతో అన్నమయ్య జిల్లాను రాష్ట్రస్థాయిలో ఉత్తమ జిల్లాగా నిలబెట్టేందుకు కృషి చేస్తానన్నారు. నూతన జాయింట్ కలెక్టర్‌ను మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆరచవతీతీచ మధుసూదనరావు, కలెక్టరేట్ ఏవో నాగభూషణం, కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖల జిల్లా అధికారులు కలిసి స్వాగతం పలికారు.



జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలసిన జాయింట్ కలెక్టర్ శివనారాతణ శర్మ

## ఓటర్ల నమోదులో అగ్రగామిగా పశ్చిమ గోదావరి జిల్లా

**భీమవరం, జనవరి 21 :**
ఓటర్ల నమోదులో విశేష ప్రతిభ కనబరిచి పశ్చిమ గోదావరి జిల్లా మరో ఘనతను సాధించింది. జిల్లాలో అత్యధిక ఓటర్ల నమోదు సాధించేందుకు చేపట్టిన సమర్థవంతమైన చర్యలకు గుర్తింపుగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చదలవాడ నాగరాణికి "ఉత్తమ ఎన్నికల విధానాల అవార్డులు -- 2025" కు



ఎంపిక చేస్తూ ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంది . జనవరి 25న నిర్వహించనున్న 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియలో ఉత్తమ చర్యలు చేపట్టిన జిల్లాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఎంపిక చేసింది. ఈ ఎంపికలో అత్యధిక ఓటర్ల నమోదు విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా ఒక్కటే అవార్డుకు ఎంపిక కావడం విశేషం. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జనవరి 25 న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఈ అవార్డును స్వీకరించనున్నారు.
మొత్తం 12 జిల్లాలను వివిధ విభాగాల్లో ఎంపిక చేయగా, ఓటర్ల నమోదులో అగ్రగామిగా నిలిచిన జిల్లాగా పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్?ను జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్?ఓ బి. శివన్నారాయణ రెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు అభినందించారు.

# వివక్ష లేని కులరహిత సమాజమే ఎస్సీ కమిషన్ లక్ష్యం

### ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్..

**విజయవాడ, జనవరి 21 :**
షెడ్యూల్డ్ కులాల హక్కుల కోసం పనిచేస్తూనే, వివక్ష లేని కులరహిత సమాజమే లక్ష్యంగా ఎస్సీ కమిషన్ పనిచేస్తుందని ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్. జవహర్ అన్నారు. స్థానిక జింఖానా గ్రౌండ్స్‌లోని కందుకూరి కళ్యాణ మండపంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సీ కమిషన్ సభ్యుల ప్రమాణ స్వీకారమహోత్సం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సభ్యులు మేకల బిక్షం (బాబు), శ్రీమతి ఎస్టీ రామాంజినమ్మ, రావాడ సీతారామ్, పి. గౌతమ్ రాజ్, డాక్టర్ శ్రీపతి బాబుల చేత ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కే.ఎస్. జవహర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ పదవిని స్వీకరించిన సభ్యులు డాక్టర్ బి. ఆర్ . అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, అణగారిన కులాల గొంతుకగా ఎస్సీ కమిషన్ నిలవాలన్నారు. ఎస్సీ ల్లోని 59 కులాలకు పక్షపాత దోరణి లేకండా నిష్పక్షపాతంగా సేవలు అందించాలన్నారు. దళితుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వారి ఉన్నతికి పాటు పడటమే ఎస్సీ కమిషన్ లక్ష్యంగా ఉండాలన్నారు.
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మనపై ఉంచిన నమ్మకాన్ని అంతే బాధ్యతగా నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా కమిషన్ పనిచేస్తుందని, బాధితులకు న్యాయం చేయటమే కమిషన్ లక్ష్యమన్నారు. కమిషన్ సభ్యులు తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకుని వ్యవహరించాలని కోరారు. కుల అహంకారులు, రెండు గ్లాసుల విధానం పాటించే వారిపై అంకుశం ఎక్కుపెట్టాలని సమసమాజ స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యవస్థలో సమూల మార్పు కోసం ఎస్సీ కమిషన్ శ్రమిస్తుందని హామీ ఇచ్చారు. దళితులు రాజకీయంగా ఎదగాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.
మాజీ మంత్రి, వినియోగదారుల రక్షణ మండలి ఛైర్ పర్సన్ పీతల సుజాత మాట్లాడుతూ దళితుల సమస్యల కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు, నాయకులు తమ కోసం కాకుండా సమాజంలోని అసమానతలను తొలగించడానికి పోరాడితే చరిత్రలో నిలిచిపోతారన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా ఎస్సీ కమిషన్ పనిచేయాలని పిలుపునిచ్చారు.
శాసనసభ్యులు, టిటిడీ బోర్డు సభ్యులు ఎం.ఎస్. రాజు మాట్లాడుతూ దళితులకు రక్షణ, ఆత్మగౌరవం, సంక్షేమం కూటమి పాలనలోనే దక్కాయన్నారు. ఎస్సీలకు న్యాయం జరిగేలా రక్షణ హక్కుల కోసం ఎస్సీ కమిషన్ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ విలువలతో పదవీబాధ్యతలు నిర్వహించే చైర్మన్ కేఎస్ జవహర్ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ గా ఉండటం రాష్ట్రంలో ఎస్సీలకు రాజకీయాలకు అతీతంగా ఖచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. గత ఐదేళ్లలో ఎస్సీలపై అఘాయిత్యాలు, దాడులు పెరిగిపోయాయని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి ఎస్సీలకు సంపూర్ణ న్యాయం జరుగుతుందన్నారు.
శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడుతుందని, వారి ఉజ్వల భవిష్యత్ కు పునాది వేస్తూ వారి ఉన్నతికి నిరంతరం పాటుపడుతుందన్నారు. పార్లమెంట్, శాసనసభ స్పీకర్ లుగా బాలయోగి, ప్రతిభా భారతి లను ఎన్నుకున్న చరిత్ర ముఖ్యమంత్రికే



దక్కుతుందన్నారు. దళితుల హక్కుల కాపాడటంలో ఎస్సీ కమిషన్ సభ్యులు గురుతర బాధ్యతలు నిర్వహించాలని ఆకాంక్షించారు. పల్నాడు జిల్లా పిన్నెల్లిలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవను పార్టీలకు చుట్టి రాజకీయం చేయాలని చూస్తున్న సంఘటనపై నిజ నిర్ధారణ కమిటీ వేయాలని ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్ ను శాసనసభ్యులు కోరారు.
నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సభ్యులు మేకల భిక్షం (దాసు) మాట్లాడుతూ శక్తి వంచన లేకుండా పనిచేసి దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఎక్కడ దళితులకు ఎవరికి అన్యాయం జరిగినా వారికి న్యాయం జరిగేలా నా వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం నూతనంగా ఎస్సీ కమిషన్ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు స్వీకరించిన సభ్యులను నాయకులు, అభిమానులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, దళిత కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అనుకున్న టైమ్‌కే వారణాసి విడుదల

సూపర్‌స్టార్ మహేశ్ బాబు ,దర్శకధీరుడు రాజమౌళి కలయికలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'వారణాసి'పై ఇప్పటికే దేశవ్యాప్తంగా అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రాండ్ ఈవెంట్‌లో ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించడంతో పాటు, విడుదల సంవత్సరాన్ని కూడా మేకర్స్ వెల్లడించారు. అయితే రాజమౌళి సినిమాలు అనుకున్న షెడ్యూల్‌కు కచ్చితంగా పూర్తవుతాయా అనే సందేహం ప్రేక్షకుల్లో కొత్తది కాదు. గత చిత్రాల అనుభవం నేపథ్యంలో, 'వారణాసి' నిజంగా 2027లో విడుదల అవుతుందా? అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో గట్టిగానే వినిపించాయి. ఈ నేపథ్యంలో తాజాగా చిత్రబృందం మరోసారి స్పందించి, సినిమా 2027లోనే ప్రేక్షకుల ముందుకు వస్తుందని స్పష్టత ఇచ్చింది. ఈ ప్రకటనతో కొంతమంది అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తుండగా, మరికొందరు మాత్రం ఇంకా సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఉగాది లేదా శ్రీరామనవమి లాంటి పండుగ సీజన్‌లో సినిమా విడుదలయ్యే అవకాశముందని ఫ్యాన్స్ అంచనా వేస్తున్నారు. అయితే, ఇంకా ఏడాది మాత్రమే మిగిలి ఉండటంతో అంత భారీ ప్రాజెక్ట్‌ను ఆలోపు పూర్తి చేయగలరా అనే చర్చ కూడా జోరుగా సాగుతోంది. ఈ చిత్రంలో మహేశ్ బాబు సరసన గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇది మహేశ్ కెరీర్‌లోనే కాకుండా, ప్రియాంకకు కూడా ఒక ప్రత్యేకమైన ఇండియన్ ప్రాజెక్ట్‌గా మారనుంది. విలన్ పాత్రలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనుండటం మరో హైలైట్. అంతేకాదు, సినిమాలో ఒక కీలక ఘట్టంలో మహేశ్ బాబు రాముడి పాత్రలో కనిపిస్తారని రాజమౌళి ఇప్పటికే వెల్లడించడంతో ఈ అంశంపై కూడా భారీ ఆసక్తి నెలకొంది.
'వారణాసి'ని టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో, భారతీయ పురాణాలు, ఆధునిక సైన్స్‌ను మేళవిస్తూ రూపొందిస్తున్నారని సమాచారం. భారీ బ్జడెట్, అంతర్జాతీయ స్థాయి టెక్నికల్ టీమ్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే అభిమానులు



'రిలీజ్ ఆలస్యమైనా పర్వాలేదు, కానీ ఇది లైఫ్‌టైమ్ ఎక్స్‌పీరియన్స్ మూవీ కావాలి' అంటూ సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి, మేకర్స్ 2027 డేట్‌కు కట్టుబడి ఉన్నామని మరోసారి స్పష్టం చేసినప్పటికీ, ఈ సినిమా చుట్టూ ఉన్న క్యూరియాసిటీ మాత్రం రోజు రోజుకీ పెరుగుతూనే ఉంది. 'వారణాసి' ఎప్పుడు వచ్చినా, అది భారతీయ సినిమాకు మరో మైలురాయిగా నిలుస్తుందనే నమ్మకం అభిమానుల్లో బలంగా ఉంది.

# డెకాయిట్‌లో ముగిసిన మృణాల్ యాత్ర



టాలీవుడ్‌లో కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్న అడివి శేష్ ప్రస్తుతం తన కెరీర్‌లో మరో కీలక దశలో ఉన్నాడు. వరుసగా విభిన్న కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వస్తున్న శేష్, ఇప్పుడు భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న తన తాజా చిత్రం 'డెకాయిట్' తో మరోసారి బజ్ క్రియేట్ చేస్తున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని రేపుతోంది. ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న మృణాల్ ఠాకూర్ తనకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తిగా ముగించుకుంది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటిస్తూ, సెట్స్‌లో తీసిన కొన్ని ప్రత్యేక ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. టీమ్ మొత్తం కలిసి ఉన్న ఈ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.
అడివి శేష్, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్ ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి క్యూరియాసిటీని క్రియేట్ చేసింది. ఇద్దరూ నటనలో మంచి అనుభవం ఉన్నవాళ్లే కావడంతో, ఈ సినిమాలో భావోద్వేగ సన్నివేశాలు బలంగా ఉండబోతున్నాయనే టాక్ వినిపిస్తోంది. ఇటీవలే ఈ హై వోల్టేజ్ డ్రామాకు సంబంధించిన కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసినట్లు సమాచారం. మృణాల్ షూటింగ్ ముగియడంతో, ఇకపై సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు మరింత వేగంగా సాగనున్నాయి.'సీతారామం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైన మృణాల్ ఠాకూర్, ఈ చిత్రంలో ఎలాంటి పాత్రలో కనిపించబోతుందన్నది ఆసక్తికరంగా మారింది. ఆమె పాత్ర కథలో కీలక మలుపులు తిప్పేలా ఉంటుందని చిత్ర వర్గాలు సూచిస్తున్నాయి. ఇదిలా ఉంటే, 'డెకాయిట్' రిలీజ్ డేట్‌పై కూడా మేకర్స్ స్పష్టత ఇచ్చారు. ఈ సినిమాను ఈ ఏడాది మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని నిర్ణయించారు. ఉగాది పండుగ సందర్భంగా థియేటర్లలోకి రానున్న ఈ చిత్రం, తెలుగు మరియు హిందీ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. పండుగ సీజన్ కావడంతో బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్స్ సాధిస్తుందనే అంచనాలు ఉన్నాయి. అడివి శేష్ ఎప్పటిలాగే ఈసారి కూడా కొత్త తరహా కథను ఎంచుకున్నాడు. 'డెకాయిట్' ఒక రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. శేష్ లుక్, ప్రెజెంటేషన్ అన్నీ కొత్తగా ఉండటంతో ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకంగా నిలుస్తోంది. ఈ చిత్రానికి షనీల్ డియో దర్శకత్వం వహిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. అనురాగ్ కశ్యప్, కమలక్ష్మి భాస్కర్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో నటించడం సినిమాకు అదనపు బలాన్ని ఇస్తోంది.

# నవీన్ చంద్ర హనీ మూవీ

నవీన్ చంద్ర కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'హనీ'. ఈ సినిమాకు కరుణకుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. క్షుం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. టీజర్ చూస్తుంటే.. ఈ చిత్రం నిజ జీవిత సంఘటనల ఆధారంగా, సమాజంలోని మూఢనమ్మకాలు మరియు అంధ విశ్వాసాల నేపథ్యంలో రూపొందింది. సాధారణ హారర్ సినిమాలకు భిన్నంగా, కేవలం భయపెట్టడమే కాకుండా ఒక మార్మిక ప్రపంచాన్ని ఈ టీజర్‌లో ఆవిష్కరించారు. చీకటి, నిశ్శబ్దం, మర్మమైన శక్తుల కలయికతో దర్శకుడు కరుణ కుమార్ వెన్నులో వణుకు పుట్టించే విజువల్స్‌ను వెండితెరపైకి తీసుకొస్తున్నారు. ప్రధాన పాత్రలో నవీన్ చంద్ర నటన, దివ్య పి÷-లళై, దివి, రాజా రవీంద్రల గూఢమైన పాత్రలు సినిమాపై మరింత ఆసక్తిని కలిగిస్తున్నాయి. అజయ్ అరసాడ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రధాన బలమని చెప్పవచ్చు. నాగేష్ బానెల్ సినిమాటోగ్రఫీ, మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటింగ్ ఈ చిత్రానికి సాంకేతిక హంగులను జోడించాయి. సైకలాజికల్ డెప్త్ మరియు సోషల్ రిలవెన్స్ ఉన్న ఈ 'హనీ' చిత్రం ఫిబ్రవరి 6న థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుంది.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.